AL - HiLaL

నెలవంక

మహాత్మ్మ పాజ్ఞ శకం 1434

Vol 9, Issue: 74 December - 2012 nelavankaonline.com

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى



2012.indd 1 11/28/12 12:03 PM



అర్థం చేసుకునే మనసుకు అద్భుతాలు ఎందుకు?

వారిలా అన్నారు: “నువ్వు మా కోసం భూమి నుంచి నీటి ఊటను ప్రవహింపజేయనంత వరకూ మేము నిన్ను నమ్మేది లేదు.”.

“లేదా నీ కోసమైనా ఖర్జూరాలు, ద్రాక్ష పండ్లు గల తోట ఒకటి ఉండాలి. దాని మధ్య నీవు అనేక కాలువలను ప్రవహింప జేయాలి”.

“లేదా నువ్వు చెబుతున్నట్లు ఆకాశాన్ని ముక్కలుగా చేసి మాపై పడవెయ్యి”.

“లేదా నువ్వు ఖుద్దుగా అల్లాహ్‌ను, దూతలను తెచ్చి మా ఎదుట నిలబెట్టు”.

“లేదా నీ కోసం స్వర్ణ గృహం ఏదన్నా సిద్ధం కావాలి లేదా నువ్వు ఆకాశానికి ఎక్కిపోవాలి. (ఒకవేళ నువ్వు అలా ఎక్కి పోవడం మేము చూసినా) మేము స్వయంగా చదవగలిగే గ్రంథమేదైనా మాపై అవతరింపజేయనంత వరకూ నీ అధిరోహణను కూడా మేము నమ్మేది లేదు”.

(ఓప్రవక్తా!) వారికి చెప్పు: “నా ప్రభువు పరమ పవిత్రుడు. నేను ప్రవక్తగా పంపబడిన ఒక మానవ మాత్రుణ్ణి మాత్రమే”.

(దివ్యఖుర్‌ఆన్- 17: 90-93)

2012.indd 2 11/28/12 12:03 PM

NELAVANKA
సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

హితం కూర్చేదే సాహిత్యం

'అద్దీను అన్నసీహా' హితం కూర్చేదే మతం! అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స).హితం అంటే ఏమిటి? ఎవరికి? అన్న ప్రశ్న ఉదయించవచ్చు. ఈ ప్రశ్నకు ప్రవక్త వారు ఇచ్చిన సమాధాన నేపథ్యంలో **'విశ్వ శ్రేయః కావ్యమ్'** అన్నారు సజ్జనులయిన మన పూర్వీకులు. అంటే ప్రపంచానికి, సమాజానికి మేలు చేకూర్చేదే మతం అన్న మాట. ప్రపంచం, సమాజం అంటే అందులో వ్యక్తిగత స్థాయి నుండి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకూ అందరి మేలు కోరాలన్న మాట. ఇక **'మేలు'** అంటే గురజాడ అన్నట్టు **'గట్టి మేల్'** ఏదయినా కావచ్చు అది పారమార్థిక చింతన కలిగించవచ్చు లేదా సామాజిక స్పృహను రగిలించవచ్చు. సమాజ తీరితెన్నుల్ని అభివర్ణించేది కావచ్చు. లోటుపాటుల్ని వెలికి తీసి వాటిని అధిగమించాల్సిన అవసరాన్ని గుర్తు చేయవచ్చు. అన్యాయాలను, అక్రమాలను ఎండగడుతూ వాటిని నియంత్రించే స్ఫూరిని ఇవ్వచ్చు. పారలౌకిక చింతనను పెంచి పాప కార్యాలకు దూరంగా ఉండేలా చైతన్య పర్చవచ్చు. ఇటువంటి **'గట్టి మేల్'** కోరే మతంగాని, సాహిత్యంగాని – లిఖిత రూపంలోనో, మౌఖిక రూపంలోనో ఉండొచ్చు. పాట, గేయం, పద్య కవిత, వచన కవిత, కథ, నవల, వ్యాసం, వచనాలు...ఇలా ఏ ప్రక్రియలోనైనా ఉండవచ్చు. సుదీర్ఘ మానవ చరిత్ర ఇచ్చే సాక్యం ఏమిటంటే దేశకాలానకనుగుణంగా కొందరు తమ వచనాలు, కృతులు, కిర్తనలు, పద్యాలు, గేయాల ద్వారా ప్రజలను చైతన్య పరిస్తే, కొందరు ఉపదేశాలు, వ్యాసాలు, నాటకాల ద్వారా మానవ జాతిని ఉత్తేజ పరిచారు. ఆ పరంపరలో చిరు భాగమే **'నెలవంక'** మాస పత్రిక.గతంలో మతం, సాహిత్యం సాధించిన నైతిక ప్రగతిలోని ఒకింత నైతిత, అధ్యాత్మిక చైతన్యం ప్రజల్లో తేగలిగితే **నెలవంక** ఉనికి ధన్నమయినట్టే!



ఒక సమీక్ష



మన ఆరాధ్య దైవం



దైవభీతి

AL-HiLaL
నెలవంక
(AL-HILAL MONTHLY)

Vol 9, ISSUE: 72
December - 2012

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal

PHONE
Syed Abdus Salam Omeri
97266676

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
ISLAM PRESENTATION COMMITTEE
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net

2012.indd 1 11/28/12 12:03 PM

దృక్పథం



కష్ట పడి పని చేస్తే వారు ఎవరయినా, ఎక్కడ నుంచి వచ్చిన వారయినా, ఎవర్ని ఇష్టపడినా అమెరికా అవకాశాలిచ్చిందన్నారు బరాక్ హుసైన్ ఒబామా.

అంతర్జాతీయం – చికాగో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా జీవితాన్ని ప్రారంభించిన బరాక్ హుసైన్ ఒబామా ఆమెరికా అందించిన అన్ని అవకాశాలను సద్వినియోగ పర్చుకుంటూ ఆంచెలంచెలుగా ఆమెరికా అధ్యక్ష పదవిని అధిరోహించారు. ఎన్నికల ప్రచారంలో, విద్య, కుటుంబం, నూతన ఆవిష్కరణలు అంటూ ప్రజల్లో ఆశ, ఆత్మ విశ్వాసం రేకెత్తించగల శక్తియుక్తులు ఆయనలో మెండుగానే ఉన్నాయి. ఆవే ఆయన్ను మరొక్కమారు విజేతగా నిలబెట్టాయి. గెలుపు తర్వాత ఆయన చేసిన ప్రసంగం దేశ ప్రజల్లో కొత్త స్ఫూర్తిని రగిలించింది. ముమ్ముందు సుదూర లక్ష్యాలకు చేరేందుకు ఎంతటి దూరాల్నయినా ఛేదించాలంటూ ఉద్విగ్నత నిండిన మాటల ప్రవాహాన్ని సాగించారాయన. కష్ట పడి పని చేస్తే వారు ఎవరయినా, ఎక్కడ నుంచి వచ్చిన వారయినా, ఎవర్ని ఇష్టపడినా ఆమెరికా అవకాశాలిచ్చిందన్నారు. ఆయన పేర్కొన్నట్టు సర్వ వర్ణాల, సకల అవకాశాల సమాన వేదికగా ఉంటే, ఉండనిస్తే గత చరిత్రను (అమెరికాలోని నల్లజాతివారి పూర్వీకుల్ని ఆఫ్రికా ఖండం నుంచి పశువుల్లా ఓడల మీద తోలుకొచ్చారన్న విషయాన్ని) మరచిపోయి అయినా అందుకు ఆహ్వానం పలకవలసిందే. ఒబామా నిజంగా అందుకు కృషి చేస్తే ఒప్పుకోవలసిందే. ఈ సందర్భంగా – **'శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తన దేశం అద్భుతమయినా ప్రగతిని సాధిస్తోందని, సైనికంగా అజేయంగా ఉందని....అయితే ఇవి మాత్రమే ప్రపంచ దృష్టిలో గౌరవాన్ని తెచ్చి పెట్టేవి కావని, పర్సపర సహకార భావంతో మెలగడమే ఆమెరికా కీర్తిని ఇనుమడింపజేస్తుంద'**ని ఆయన చెప్పిన మాటలు గమనార్హమైనవే. అలాగే విజయానంతరం వినయాన్ని ప్రదర్శించడం, అమెరికా కలలను సాకారం చేస్తానని చెప్పడం ఆహ్వానించదగ్గ పరిణామాలే.

ఒక సమీక్ష

పెట్టిన పెట్టుబడి తిరిగి రాక, చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక, ఆత్మాభిమానాన్ని చంపుకోలేక, తీవ్ర భావావేదనకు గురయి ఆత్మ హత్యలకు పాల్పడే దుర్భిక్ష స్థితి నెలకొనడం మిక్కిలి విచారకరం.



ఇస్లాం ధర్మం స్త్రీల, బాలికల విద్యకు వ్యతిరేకం కాదు, పైగా స్త్రీకి సంపూర్ణ స్థానాన్ని ఇచ్చిన తొలిధర్మంగా అది ప్రపంచ ఖ్యాతిని తన సొంతం చేసుకుందన్న వాస్తవాన్ని మహా మహులే అంగీరిస్తారు.



విదేశీయం – మలాలాపై దాడి జరిగిందన్న వార్త అందగానే కుల, మత, ప్రాంతాలకతీతంగా ప్రపంచవ్యాప్తంగా ఆమె కోసం ప్రార్థనలు జరిగాయి. ఆమె ప్రాణాలు నిలవాలని కోరుకున్న వారి ప్రార్థనలు ఫలించాయి. ప్రస్తుతం బ్రిటన్‌లోని బర్మింగ్ హోమ్‌లోని క్వీన్ ఎలిజెబిత్ ఆస్పత్రిలో ఆమె కోలుకుంటున్నది. బాలికల విద్య కోసం తెగువ చూపిన సాహస బాలిక అన్న ప్రశంస జల్లూ కురుస్తోంది. ఈ మధ్యనే ఆమె అనుపమాన ధైర్యానికి ఐక్యరాజ్య సమితి, నవంబరు 10 రోజును **'మలాలా డే'**గా ప్రకటించిన విషయమూ అందరికి తెలిసిందే. ఇస్లాం ధర్మం స్త్రీల, బాలికల విద్యకు వ్యతిరేకం కాదు, పైగా స్త్రీకి సంపూర్ణ స్థానాన్ని ఇచ్చిన తొలి ధర్మంగా అది ప్రపంచ ఖ్యాతిని తన సొంతం చేసుకుందన్న వాస్తవాన్ని మహా మహులే అంగీరిస్తారు. ఇక కుట్రలు, కుతంత్రాలంటే ఏమిటో తెలియని ఆ అమాయిక బాలిక అంతర్జాతీయ రాజకీయ చదరంగంలో పావు కాకుండా ఉంటే అదే పది వేలు. పోతే,

నిజం ఎప్పుడూ నివురుగప్పిన నిప్పులాంటిది. మసి తొలిగితే నిజ రూపం బయట పడుతుంది. ఆ మసి క్రింద నిప్పును దాచి పెట్టే ప్రయత్నం ఎవరు చేసినా వృధా ప్రయాసే. కొంత కాలంపాటు వారి ఎత్తుగడ ఫలించవచ్చు, ఎల్లకాలం కాదు. ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. కానీ, ఈ సత్యాన్ని విస్మరించి స్వయ ప్రయోజనాల కోసం 11ఏళ్ల సుదీర్ఘ ప్రణాళికతో అగ్రదేశ అనుభవం గల నాయకులు ప్రాకులాడటం విస్మయానికి గురి చేసే విషయం. అసలు ఏది సత్యమో, ఏది అసత్యమో గ్రహించలేనంత అమాయకులేం కాదు ప్రజలు భూమిపై జరిగే ప్రతిదానికి ప్రత్యక్ష సాక్షులు వారు. కాబట్టి ప్రజల అభిప్రాయాన్ని మార్చడంలో, తప్పు త్రోవ పట్టించడంలో కీలక పాత్ర పోషించే ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ మీడియా తాను ప్రసారం చేసే వార్తల మీద ఆత్మావలోకనం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతయినా ఉంది.

స్వదేశీయం – వివేకానందుని ఐక్యూపై నితిన్ గడ్కారీ చేసిన వ్యాఖ్యల దుమారం చల్లారక ముందే బీజేపీ నేత, ప్రముఖ న్యాయవాది రామ్ జెఠ్మలానీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. చైత్రశుద్ధి నవమినాడు అయిదు గ్రహాలు ఉచ్ఛ స్థితిలో ఉన్న సమయంలో పునర్వసు నక్షత్రంతో కూడిన కర్కాటక లగ్నంలో పగటి వేళ కౌసల్య పుత్రునిగా జన్మించిన శ్రీరాముడు – **'మంచి భర్త కాదం'**టూ అభ్యంతర వ్యాఖ్యలు చేసి జెఠ్మలానీ భారతీయ జనతా పార్టీని ఇరకాటంలో పడేశారు.

2012.indd 2 11/28/12 12:03 PM



కోట్లాది ప్రజలు అభిమానించే ఒక వ్యక్తిని కించపరిచే విధంగా వ్యాఖ్యానించడాన్ని, ఒకరి మత విశ్వాసాలకు ఇబ్బంది కలిగించే విధంగా మాట్లాడటాన్ని ఇస్లాం సుతరామూ సమ్మతించదు.

త్రేతాయుగంలో భూమిపై నడిచిన సత్యం, మానవ రూపంలో భాసించిన నైతిక మహత్యం, అసుర శక్తులపై ఎక్కు పెట్టిన మహాస్త్రం, ఆదర్శ పురుషుడు, ఆదర్శ భర్త, ఆదర్శ కుమారుడు, ఆదర్శ జనకుడు అంటూ ద్రష్ట వాల్మీకి అభివర్ణించిన రాశీ భూత ధర్మం గల శ్రీరాముడు **'కేవలం ఒక వ్యక్తి చేసిన విమర్శని ఆధారంగా చేసుకుని గర్భంతో ఉన్న సీతమ్మను అడవుల పాలు చేశాడని'** భార్య భర్తల సంబంధాలపై తాను వ్రాసిన పుస్తకావిష్కరణ సభలో రామ్ జెర్మలాని పేర్కనడంపై సహజంగానే స్పందించించిన అభిమానులు **'రామ్ జెర్మలానీ పేరుకు బదులుగా రావణ్ జెర్మలానీ పెట్టుకోవాల'**ని ఆగ్రహం వ్యక్తం చేసారు.

పరిమితి లేని కారుణ్యం, ద్వేషించేవారిని సయితం చంపకుండా వదిలేసే ప్రేమతత్వం ఆయనదనీ, రావణుడికి అంత్యక్రియలు జరపడానికి విభీషణుడు తిరస్కరించగా నేను చేస్తానంటూ ముందుకొచ్చాడని, దేవతల ఆహ్వానాన్ని తిరస్కరించి **'దశరథ కుమారుడి'**గానే తర్వాత 11000 (?) సంవత్సరాలు జీవించి భూమిని పునీతం చేశాడని చెప్పుకునే **'శ్రీరాముడంటే తనకు గిట్టదని, శ్రీరాముడే కాదు లక్షమణుడి పాత్ర కూడా సరిగా లేదని, ఇలాంటి వారి పట్ల తనకు ఎంత మాత్రం గౌరవం లేద'**ని జెర్మలానీ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు రామ్ జెర్మలానీ, ఆయన పార్టీ తక్షణం క్షమాపణ చెప్పాలని పార్టీలన్ని డిమాండ్ చేడమే కాక, బీజేపీకి అధికారం కోసమే రాముడు కావాలని, కమల నాథులకు నిజంగా రాముడిపై భక్తి లేదని కాంగ్రెస్‌తోపాటు అన్నీ పార్టీల వారు విమర్శించారు. ఏది ఏమయినా, కోట్లాది ప్రజలు అభిమానించే ఒక వ్యక్తిని కించపరిచే విధంగా వ్యాఖ్యానించడాన్ని, ఒకరి మత విశ్వాసాలకు ఇబ్బంది కలిగించే విధంగా మాట్లాడటాన్ని ఇస్లాం సుతరామూ సమ్మతించదు.

నిజం ఎప్పుడూ నివురుగప్పిన నిప్పులాంటిది. మసి తొలిగితే నిజ రూపం బయట పడుతుంది. ఆ మసి క్రింద నిప్పును దాచి పెట్టే ప్రయత్నం ఎవరు చేసినా వృధా ప్రయాసే. కొంత కాలంపాటు వారి ఎత్తుగడ ఫలించవచ్చు, ఎల్లకాలం కాదు.




తగు కాలంలో, తగు రీతిలో వైద్య సదుపాయాలు ఆమ్ ఆద్మీ కోసం నేటికీ అందని ద్రాక్షగానే ఉంది. వైద్యం వ్యాపారంగా మారిపోయినా నేటి తరుణంలో పాలకులు ప్రేక్షక పాత్ర వహించక చిత్త శుద్ధితో నివారణాచర్యలు చేపట్టాలి.

ఇది ఏదోక వ్యక్తి విషయంలోనే కాదు. ఏ మతానికి చెందిన వ్యక్తి విషయంలోనయినా ఖండించ దగినదే అంటుంది. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా విశ్వవ్యాప్తంగా మన్నలందుకుంటున్న మన దేశ ప్రతిష్టను, ప్రత్యేకతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి భారతీయుని మీద ఉందన్న విషయాన్ని నేతా శ్రీలు గుర్తించి మసలుకుంటే మంచిది.

రాష్ట్రీయం – **'ఆరోగ్యమే మహా భాగ్యం'** అన్నారు వెనుకటికి పెద్దలు. అయితే, ఇప్పటికే రాష్ట్రంలో వివిధ జబ్బులతో అల్లాడుతున్న ప్రజలపై నీలం తుఫాను ప్రభావంతో కురిసిన కుంభవృష్టి వల్ల ఈ వ్యాధులు మరింత పెరిగే ప్రమాదం ఉంది. తగు కాలంలో, తగు రీతిలో వైద్య సదుపాయాలు ఆమ్ ఆద్మీ కోసం నేటికీ అందని ద్రాక్షగానే ఉంది. వైద్యం వ్యాపారంగా మారిపోయినా నేటి తరుణంలో పాలకులు ప్రేక్షక పాత్ర వహించక చిత్తశుద్ధితో నివారణాచర్యలు చేపట్టాలి. హామీలు, సర్వేలు, సమీక్షలు, సమావేశాలతో కాలం గడపకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని ప్రజల సమస్యలు తీర్చి, వారిని అన్ని విధాల ఆదుకోవాల్సిన సమయం ఇది.

పోతే, **'భూమిని నమ్ముకున్నవాడు ఎన్నటికీ చెడిపోడు'** అన్న మాట ప్రస్తుతం ఉన్న మాటగా కన్పించడం లేదు.**'ప్రగతికి పట్టుకొమ్మలు'** అని గాంధి గారు చెప్పిన పల్లెసీమల్లోనే ఉంటూ, పంటపొలాల్నే సర్వస్వంగా భావించి వ్యవసాయమే ఆధారంగా గడపటం ఒక పరీక్షగా పరిణమించే దుస్థితి దాపురించింది. **'రైతు సంక్షేమమే తన పార్టీ ధ్యేయమని, వారి అభ్యున్నతికి ఏమి చేయడానికయినా సిద్ధమేన'**ని చెప్పిన మాటలు, ప్రవేశ పెట్టిన పథకాలు, ప్రణాళికలు చేతల్లో చూపించని కారణంగా **అన్నదాత** స్థితి ఏ మాత్రం మారకపోగా మరింత దిగజారిపోవడం ఆందోళన కలి గించే అంశం.



ఒక ప్రక్క ప్రకృతి సృష్టించే బీభత్సాలు, మరో ప్రక్క సాటి మానవులు చేస్తున్న దోపిడి, అవినీతితో **అన్నదాత** రోజురోజుకు అయోమయ స్థితికి గురవుతున్నాడు. పెట్టిన పెట్టుబడి తిరిగి రాక, చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక, ఆత్మాభిమానాన్ని చంపుకోలేక, తీవ్ర భావావేదనకు గురయి ఆత్మ హత్యలకు పాల్పడే దుర్భిక్ష స్థితి నెలకొనడం మిక్కిలి విచారకరం. ఈ విషయం మీద ప్రభుత్వం, ముఖ్యంగా వాతావరణ శాఖాధికారులు చిత్తశుద్ధితో నివారణోపాయాలు చేపట్టాల్సి ఉంది.

చట్టం తన పని తాను చేసుకుపోయింది – అంతిమ తీర్పు అమలయింది. ముంబయిలో నర మేధానికి పాల్పడి 166 మందిని పొట్టనబెట్టుకుని 4000 కోట్ల ఆస్తి నష్టం కలిగించిన కిరాతక మూకలో సజీవంగా పట్టుబడ్డ ఉగ్రవాది కసబ్‌ను బుధవారం ఉదయం ఉరి తీశారు. అయితే దేశంలో బాహాటంగా తిరుగుతున్న స్వదేశీయ విద్రోహశక్తులకు శిక్షలేవీ? అలాగే దేశీయంగా అంతర్గత భద్రత యంత్రాంగం పదును తేలనంత వరకు – ఒక కసబ్‌ను ఉరి తీసినంత మాత్రాన యావత్ జాతి నిబ్బరంగా ఉండే వీల్లేదు!

ఇదీ నేటి మన స్థితి! కరుణామయుడయిన అల్లాహ్ అందరి సమస్యలను తీర్చి, **'సర్వేజనా సుఖినో భవంతు'** వంటి వాతావరణాన్ని కల్పించాలని మనసారా వేడుకుంటున్నాము!

అబ్దుస్సలాం

2012.indd 3 11/28/12 12:03 PM

- శాంతిప్రియ

గివ్ మీ సమ్ సన్ షైన్

బాల్యం - జగం మరచిన నవ్వులు బాల్యం. చెరువుల్లో, చేలల్లో, మేళల్లో, పచ్చని తోటల్లో, పాతబడ్డ కోటల్లో ఉరుకులు, పరుగులు బాల్యం. అమ్మ పెట్టే ముద్దల్తో, అమ్మమ్మ చెప్పే కథల్తో, నాన్నమ్మ ఇచ్చే ముద్దుల్తో, తాత తెలిపే నీతుల్తో, నాన్న ఇచ్చే గిప్టుల్తో సరదాగా, సంతోషంగా సమయం గడపటం బాల్యం. ముఖంపై కల్మషం ఎరుగని మందహాసం ఉంటుంది. మదిలో ఆటలాడుకోవాలన్న ఉత్సాహం ఉంటుంది. మైలుదూరమయినా బడికెళ్లడంలో అంతులేని ఆనందం ఉంటుంది. కొబ్బరుండ పంచుకొవడంలో ...పిప్పర్ మెంట్ బిళ్లలు చప్పరించడంలో అనిర్వచనీయమయిన మధురానుభూతి ఉంటుంది. అందరూ తనవారే, పరాయి వారే లేరన్న సంతృప్తి, సాత్వికత ఉంటుంది. బడి పంతులు గారి ప్రశంసపై మక్కువ ఉంటుంది. బడి వదలగానే మళ్ళీ ఆడుకోవచ్చనే ఆశ ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, బాల్యం మన స్తోమతకొద్దీ మనం పరిపూర్ణంగా పొందినది. పరవశంతో మళ్ళీ మళ్లి తలచుకునేది! ఈ కారణంగానే -

'యే దౌతలత్ భి లేలో, యే షాహ్‌రత్ భి లేలో, భలే ఛీన్లో ముఝ్సే మేరీ జవానీ.
మగర్ ముఝ్కో లౌటాదో బచ్‌పన్‌కా సావన్, వో కాగజ్‌కి కిష్తీ వో బారిష్‌కా పానీ.....'

అంటూ తన బాల్యాన్నే స్మరించుకున్నాడో కవి.



పిల్లల లోకం మనకు తెలియని లోకమేం కాదు; బాల్య స్మృతులు లేని పెద్దలుండరు. అయితే వయసు మీద పడేకొద్దీ, బరువు బాధ్యతలు పెరిగేకొద్దీ మన బాల్య స్మృతులు మసకబారడం మొదలవుతాయి. చివరికి మమకారాన్ని మరచి గుండెను బండలా మార్చుకుని మన కలల పంటల్నే మనం నిర్లక్ష్యం చేస్తుంటాము, స్వేచ్ఛగా తిరిగే తూనిగని చిన్నతనంలో దారం కట్టి ఆడిన సంఘటన మీకు గుర్తే ఉంటుంది. అప్పుడు మనకు ఆ చిన్న ప్రాణి బాధ అర్థం కాలేదు. అసలు దానికో మనసుంటుందని, దానికీ బాధ కలుగుతుందనిగాని అప్పుడు మనకు తెలీదు. ఇప్పుడు మనం ఎదిగాము. తెలివింతులం అయ్యాము. ఇప్పుడు మన పిల్లల కళ్లల్లో సునిశితంగా చూసినట్లయితే, మనం వారిపై వేస్తున్న అధిక భారానికి, ఒత్తిడికి తట్టుకోలేక - ఇకనయినా వదిలి పెట్టమనే అభ్యర్థన కనబడుతుంది.పిల్లలు మరమనుషులు కారు; చెప్పినవన్నీ చెప్పినట్టు వల్లె వేయ డానికి. బాల్యం అంటే కాంపిటేటివ్ స్పిరిట్ పేరిట క్లాసు రూముల్లో కుక్కి శ్వాస ఆడని రీతిన నలిపేయడం కాదు. ట్యూషన్ల పేరిట ఉన్న ఆ కాస్త సమయాన్ని కూడా మింగేయడం కాదు. వారి చిట్టిపొట్టి ఇష్టాలను అదిమేసి, స్వేచ్ఛను చిదిమేసి డాన్సులు, పాటలు నేర్పడం కాదు. మార్కులు...కాదు..కాదు...ర్యాంకులు తెచ్చుకుంటే ముద్దులు...లేదంటే గుద్దులు..ఇది కాదు వాత్సల్యం. భవిష్యత్తు పట్ల భయంతో బాల్యాన్ని తాకట్టు పెట్టడం కాదు ప్రేమంటే. వారి బాల్యాన్ని వారి నుండి బలవంతంగా లాక్కోవడం కాదు. మన ప్రేమ తోడుగా, వాత్సల్య నీడగా వారిని స్వేచ్ఛగా ఎదగనిద్దాం! వారి జీవితం సాఫీగా సాగిపోవడానికి, విజ్ఞాన సముపార్జనకు కావాల్సిన చదువు చాలా అవసరం. కానీ, వేట...వేట..ర్యాంకుల వేట..అంతులేని ఆశల వెంపర్లాట. అందుకోలేని నిరాశలో కుంగుబాట. నిస్పృహ లోనయి మరణ వాత. ఈ పోటీలో జరగరానిది జరిగితే తల్లిదండ్రులకు గుండె కోత! ఎందుకీ రోత! వినండి! పైకి చెప్పలేక మధన పడే ఆ హృదయాల ఘోష!

తొలి అడుగయినా పడలేదే అలిసిందా నా పయనం
ఇంకా మొదలయినా కాలేదే ముగిసిందా పురాతం
లేనే లేదా నా కోసం ఏనాడు ఏ అవకాశం
కన్నెదురుగా ఉన్నా సరే కనరాదుగా నాకే నేను
దారిని చూపే ప్రతి దీపం మంటయి పోతుంటే
చినుకే ఇవ్వని ఆకాశం చిగురించాలనుకుంటే.....

ఒక స్వాతి చినుకు భవితవ్యం అది పడే స్థానంపై ఆధార పడి ఉంటుంది. కాలుతున్న ఇనుము మీద ఆ నీటి చుక్క పడితే క్షణాల్లో ఆవిరయిపోతుంది. తామరాకు మీద పడితే కొంత కాలం పాటు మెరుస్తుంది. అదే ఒక ఆల్చిప్పలో పడితే ముత్యమయి విలువని సంతరించుకుంటుంది. ఈ ఉదాహరణకీ పిల్ల జీవితానికి అవినాభావ సంబంధం ఉంది. అంటే పిల్లల్లో సయితం మూడు రకాలు. 1) ఆల్చిప్పలో పడిన స్వాతి చినుకులా బాల్యం నుండే గొప్ప విలువలతో

2012.indd 4 11/28/12 12:03 PM

జీవించి, మంచి స్థాయికి చేరుకుని ఇంకా ఆదర్శంగా బ్రతికేందుకు ప్రయత్నిస్తూ జీవించే వారు. 2) పెద్దలకున్న పలుకుబడితోనో, మరో మార్గాననుసరించో వీరు పైకి వస్తారు. కానీ తామరాకుపై నీటి బొట్టులా వీరి జీవితం మొదట తళతళలాడినా కొంతకాలానికి కళా హీనమయిపోతుంది. 3) ప్రారంభ దశలోనే జీవితానికి విలువ ఇవ్వని వీరు పెరిగేకొద్దీ వ్యసనాలు, గొడవలు, అల్లర్లు అలజడులకు పాల్పడుతూ జీవితంలో ఉత్సాహం, ఉల్లాసాన్ని కోల్పోయి జీవచ్ఛవాల్లా మిగిలిపోతారు. కాలుతున్న ఇనుము మీద పడిన నీటి చుక్క ఆవిరయిపోయినట్టు వీరి జీవితాల్లోని శాంతి, సంతృప్తి హరించుకుపోతుంది. ఒకవేళ ఇటువంటి వ్యసనపరులు అదృష్టం కలిసొచ్చి హీరోలయినా చివరికి మాత్రం జీరోలుగా మిగిలిపోతారు.

ఇక్కడ తల్లదండ్రులుగా మనం గమనించాల్సిందేమిటంటే, ఒక పొలంలో కలుపు మొక్కలు, పిచ్చి మొక్కలు విచ్చలవిడిగా పెరిగి మంచి పైరు నాశనమయిందంటే తప్పు పైరుది కాదు. ఆ తప్పు కలుపు మొక్కలదీ కాదు.

ముమ్మాటికి ఆ తప్పు రైతుదే అన్న యదార్థాన్ని మనం అంగీకరిస్తాం కదా! అలాగే మన పిల్లలు గొప్పవారుగా ఎదిగినా, మధ్యములుగా మిగిలిపోయినా, అధములుగా తయారయినా అందుకు కారణం వారొక్కరే కాదు. మనం కూడా కారకులమే, సమాన స్థాయి భాగస్వాములమే. కుటుంబ పెద్దలమయిన మనం పిల్లలు ఎదిగేకొద్దీ తోటి పిల్లల నుంచి, పరిసరాల నుంచి, పాఠశాలల నుంచి వారు సమకూర్చుకున్న జ్ఞానాన్ని సమన్వయంగా ఉపయోగ పడేలా, అది సత్యబద్ధంగా ఉండేలా చూడాలి. ఉచితానుచితాల విచక్షణా జ్ఞానాన్ని వారికివ్వాలి. పిల్లలు మన గుమ్మానికి కట్టుకునే ఆకులో, పూలో కారు. కుటుంబం అనే చెట్టు నుంచి జీవన చైతన్యాన్ని ఆస్వాదిస్తూ విచ్చుకునే మొగ్గలు. ఆ చెట్టులోని ఒక్కో రెమ్మ, ఒక్కొక్క కొమ్మ, ఒక్కొక్క ఆకు ఉపయోగదాయకమయినట్టే, పువ్వయి విరబూసి పండుగా మారిన మన సంతానం నుండి సయితం దాని మధురామృతం జాలువారుతుంది, ఆ ఫల విత్తనమే తన నైజం దృష్ట్యా మరో మహావృక్ష సృజనకు కారణమవుతుంది.


కాబట్టి తల్లిందండ్రులుగా మనం మనోహరమయిన ఈ పూదోటను కాపాడుకోవాలంటే అందుకు తగిన శ్రమ పడాలి. తోటమాలిలా కష్టించి పిల్లల్ని పెంచాలి.సారవంతమయిన నేల, పరిశుద్ధమయిన గాలి, నీరు అందమయిన తోటకు ఆలంబన. సూర్యుడు వాటి ఊపిరి. ఈదురు గాలులు, పెనుతుఫానులు, ఈ వృక్షాల పోరాట పటిమను ద్విగుణీకృతం చేసే సాధనాలు. తోటలో ఒక్క చెట్టు ఎదిగి ఫలసాయాన్ని ఇవ్వాలంటే అందుకు ఇన్ని శక్తులు సహకరించాలి మరి. అంటే తోటమాలులమయిన మనం ప్రేక్షక పాత్ర వహిస్తామని కాదు. అసలు పిల్లలు సరిగ్గా ఎదగడానికి మూల కారకులం మనమే. అలా కాక, మన కలల పంటలతో రోజుకో అరగంటయినా గడపడానికి, వారి మనోభావాల్ని అర్థం చేసుకోవడానికి సమయం లేనంత బిజీలోమనం ఉంటే...రేపు వారికి చెప్పి ప్రయోజనం ఉండదు. చేతులు కాలాక ఆకులు పట్టుకుందాములే అనో, రోగం వచ్చాక వైద్యం చేయిద్దాములే అనో నిర్లక్యం చేయకూడదు. ఆకులు పట్టుకునే గత్యంతరం రాకుండా, మహమ్మారి రోగాన్ని భరించే దుస్థితి ఎదురవకుండా ముందే జాగ్రత్త పడాలి.



నేడు ఎంతో మంది గొప్ప ప్రతిభ గల పిల్లలు మన కళ్ల ముందే ఉన్నా కూడా మనం వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని గుర్తించే స్థితిలో లేము. కారణం ఆ పిల్లల్లో ఆ యువకుల్లో గల అల్లరే. ముఖ్యంగా యువకుల్లో టీజింగ్ చేసే స్వభావం ఉంటుంది. వారికి భవిష్యత్తును భూతద్దంలో చూపించి బెదరగొట్టాలనుకునే ఆలోచనకు స్వస్తి పలికి జీవితాన్ని ప్రేమించడం, జీవిత మకరందాన్ని ఆస్వాదించడం నేర్పాలి. ఒకవేళ పిల్లలు మన వద్దకొచ్చి, కామర్స్ గురించి, గ్లామర్స్ గురించి, సెక్స్ గురించి, సెన్సెక్స్ గురించి, ప్రేమ గురించి, పెళ్ళి గురించి, సామాజిక, రాజకీయ, జాతీయ, ఆంతర్జాతీయ అంశాలగురించిచిగానీ చర్చించినప్పుడు - మనం విసుక్కోక అసలు వాళ్ళు మనల్నే ఎందుకు సంప్రతించారు? మన పట్ల గౌరవం, నమ్మకం లేకపోతే వారు మనతో ఇలా అడిగే వారా? అని పేరెంట్స్‌గా కాక ఫ్రెండ్స్‌గా ఆలోచించాలి. మనల్ని వారు ఫ్రేమిస్తున్నారు, మన మాటకు విలువ ఇస్తున్నారు కాబట్టే వారి సమస్యలను మనతో వచ్చి చెప్పుకుంటున్నారు. కన్నవారమయి మనమే వారి మనోభావాల్ని అర్థం చేసుకోకపోతే పాపం వారెక్కడికెళతారు? వారు పడ్డారు నిజమే; కానీ మనం వారికి చేయందించి లేపాలి. మన సంతానం మా నుండి కోరుతున్నదేమిటి? మీరు కాంతి మూలాలు. శాంతి మూర్తులు. **గివ్ మీ సమ్ సన్ షైన్ - నాకు కాస్త వెలుగు, కాసిన్ని కిరణాలు కావాలి.....**

మరో కావాలి! మళ్ళీ నాకు అవకాశం ఇవ్వండి!!

2012.indd 5 11/28/12 12:03 PM



ప్రవక్త ఈసా

(అలైహిస్సలామ్) - 2

ప్రవక్త ఈసా (అ) సృష్టికర్తను వేడుకుంటూ, ఒక మహత్యం చూపించాలని అభ్యర్థించారు. అల్లాహ్ ఆయన ప్రార్థనను ఆలకించాడు. మరుక్షణం వారి ముందు ఆహార పదార్థాలు వడ్డించిన ఒక బల్ల ప్రత్యక్షమయ్యింది.

కాని బహిరంగంగా ఆయనకు కీడు తలపెట్టడం వారి వల్ల కాలేదు. ఎందుకంటే, ప్రజలు పెద్ద సంఖ్యలో ఆయన్ను అభిమానిస్తున్నారు. అందువల్ల ఆయనకు వ్యతిరేకంగా కుట్ర పన్నడం ప్రారంభించారు. (చదవండి దివ్య ఖుర్ఆన్:17:16-36, 2:87,3:45-60,4:156-159/171-172, 5:17/46/72/ 75, 19:30-31, 23:15,63:57-65,61:6-14,5:109-120, 57:26-27, 9:111)

విందులో మహత్యం

తన శిష్యులతో సహా ప్రవక్త ఈసా(అ) ప్రతిపట్టణాన్ని సందర్శించి అల్లాహ్ సందేశాన్ని ప్రచారం చేయడం ప్రారంభించారు.ఆయన శిష్యులు సంఖ్యలో చాలా తక్కువ మంది కాని ఆయన కోసం దృఢంగా నిలబడే మద్దతుదారులు. ప్రవక్త ఈసా(అ) అన్యాయాలకు వ్యతిరేకంగా తన గొంతు విప్పారు. ఈ ప్రయాణాల్లో ఒకసారి ఒక బంజరు భూమికి చేరుకున్నారు. వారు అలసిపోయి ఉన్నారు. ఆకలి దప్పులతో ఉన్నారు. ప్రవక్తఈసా (అ) వారి ధైర్య స్థయిర్యాలను పెంచడానికి తన దైవిక ఉద్యమం గురించి వారికి సమగ్రంగా వివరించడం ప్రారంభించారు. ఆ విధంగా వారు ఆకలి దప్పులను మరచిపోయేలా చేయాలనుకున్నారు. కాని కేవలం నోటి మాటల ద్వారా ఆకలిదప్పుల బాధలు తీరడం లేదు. వారు ఏదైనా మహత్యం చూపించాలని కోరారు. ఆహార పదార్థాలు వడ్డించిన ఒక బల్ల తమ ముందుకు వచ్చేలా చేయాలని కోరారు. వారు ఈ కోరిక కోరడం వెనుక ఎలాంటి మూర్ఖపు ఆలోచనలు లేవు, వారి విశ్వాసంలోనూ ఎలాంటి లోపం లేదన్న విషయం ప్రవక్తఈసా (అ) గ్రహించారు. వాళ్ళు కేవలం అల్లాహ్ శక్తి సామర్థ్యాలను మరోసారి చూడాలనుకుంటున్నారు. ప్రవక్త ఈసా (అ) సృష్టికర్తను వేడుకుంటూ, ఒక మహత్యం చూపించాలని అభ్యర్థించారు. అల్లాహ్ ఆయన ప్రార్థనను ఆలకించాడు. మరుక్షణం వారి ముందు ఆహార పదార్థాలు వడ్డించిన ఒక బల్ల ప్రత్యక్షమయ్యింది. ఇది తనకు, తన శిష్యులకు ఒక పరీక్ష అవుతుందేమో అని ఆయన భయపడ్డారు. ఈ మహత్యం తనకు, తన శిష్యులకు ఒక కారుణ్యంగా చేయాలని ఆయన అల్లాహ్‌కు మొర పెట్టుకున్నారు.

ఆ తర్వాత వారంతా ఆ ఆహార పదార్థాలను కడుపారా భుజించారు. ఈ విందులో చుట్టు ప్రక్కల ప్రజలు చాలా మంది వచ్చి పాల్గొన్నారు. అందరూ తిన్నారు. దైవికంగా అక్కడకు వచ్చిన ఆ ఆహార పదార్థాలుఎంత మంది తిన్నా తరగలేదు. ఆ తర్వాత కూడా చాలా కాలం వరకు ఆ మహత్యం గురించి ప్రజలు కథలు కథలుగా చెప్పుకున్నారు. ఈ మహత్యం తర్వాత చాలా మంది ప్రవక్త ఈసా సందేశాన్ని విశ్వసించారు. (చదవండి దివ్యఖుర్ఆన్: 5:112-115)

అబద్ధపు ఆరోపణలు

యూద మత పెద్దల వాదనలను తప్పుగా నిరూపిస్తూ, సత్యమేదో అసత్యమేదో తేటతెల్లం చేస్తుండడంతో ప్రవక్త ఈస్తా (అ) వారికి కంటిగింపయ్యారు. ఆయన పట్ల వారు వైరం పెంచుకున్నారు. ఆయన వాదనలకు వ్యతిరేకంగా వారు సమర్థవంతంగా వాదించలేక పోయారు. అందువల్ల ఆయన్ను ఒక మోసగానిగా, ఒక అబద్ధాల కోరుగా ప్రచారం చేయడం ప్రారంభించారు. ఆ ప్రాంతం పాలకుని వద్ద ఆయనకు వ్యతిరేకంగా ఒక తప్పుడు ఫిర్యాదు నమోదు చేశారు. అప్పట్లో అక్కడ రోమన్ ప్రభుత్వం పాలిస్తోంది. ప్రవక్త క్రీస్తు ప్రజలను రెచ్చగొడుతున్నారని, విదేశీ పాలకులపై తిరగ బడేలా చేస్తున్నారని, ఆయన చర్యలు యూద ధర్మంపై తిరుగుబాటుకు దారి తీస్తున్నాయని ఫిర్యాదు చేశారు. ఆయన్ను ఒక మంత్రగానిగా ఆరోపించారు. మంత్ర తంత్రాలు చేస్తున్నాడన్నారు.

ప్రవక్త ఈసా(అ) ప్రదర్శించిన అనేక మహత్యాలను చూసిన తర్వాత కూడా వారు తమ వైఖరిని మార్చుకోలేదు. మోసాలకు, ద్రోహాలకు పూనుకున్నారు. ఆయన్ను చంపేయాలని భావించారు. రోమన్ పాలకులను కూడా ఈ పరిణామాలు కలవరానికి గురి చేశాయి. ప్రజల్లో సమానత్వం వంటి విప్లవాత్మక భావాలు వ్యాపించడాన్ని వాళ్ళు కూడా సహించలేరు. చివరకు ప్రవక్త ఈసాను నిర్బంధించడానికి వాళ్ళు అంగీకరించారు. కాని ప్రవక్త ఈసా(అ) వారికి ఎక్కడ కూడా కనబడలేదు. ఆయన దైవ సందేశాన్ని ప్రచారం చేస్తూ దూరప్రదేశాల్లో

2012.indd 6 11/28/12 12:03 PM

తిరుగుతున్నారు. పరిస్థితులకు అనుగుణం గా బహిరంగంగా లేదా రహస్యంగా ఆయన ప్రచారం కొనసాగుతోంది.

మోసం

ప్రవక్త ఈసా ఆచూకి చెప్పినవారికీ భారీ బహు మానం ఇస్తామని పాలకులు ప్రలోభ పెట్టారు. చీకటి పడుతున్న సమయంలో ప్రవక్త ఈసా రాత్రి గడపడానికి బస చేయాలను కున్న తోటకు చేరుకున్నారు. ఆ ప్రదేశాన్ని రోమన్ సైనికులు చుట్టుముట్టడాన్ని చూసిన ఈసా శిష్యులు పారిపోయారు. ప్రవక్త ఈసా (అ) వంటరిగా శత్రువుల వలయంలో మిగి లిపోయారు. చివరికి ప్రవక్త ఈసాను అల్లాహ్ శత్రువుల బారి నుండి కాపాడి సజీవంగా తన వైపునకు ఎత్తుకున్నాడు.

గ్రహించవలసిన పాఠాలు

➪ తీర్పుదినాన మానవులకు మళ్ళీ బ్రతికించడం జరుగుతుందన్న విషయానికి ఒక నిదర్శంగా ఈసా ప్రవక్తను తండ్రి లేకుండా సృష్టించడం జరిగింది. ప్రవక్త ఈసా పుట్టుకకు ముందు యూదుల ఒక గ్రూపు మరణానంతరం మళ్ళీ బ్రతికించడం జరగదని వాదించేది. ఈ గ్రూపును సెడ్యూసీస్ అనేవారు. ల్యూక్, అధ్యాయం 20, వాక్యం 27 ప్రకారం, 'అప్పుడు కొందరు సెడ్యూసీలు – మృత్యు వుతో జీవితం ముగిసిపోతుందని విశ్వసించేవారు.–మరణానంతరం మళ్ళీ బ్రతికించడం లేదన్నారు.)

➪ గత కాలాలకు చెందిన ప్రవక్తలపై అవతరించిన క్రింది గ్రంథాలతో పాటు ఇంజీల్ గురించి కూడా దివ్యఖుర్ఆన్‌లో ప్రస్తావనలు ఉన్నాయి. ప్రస్తుత బైబిల్ వీటి నుంచి ఏర్పడిందే! బైబిల్‌లో పాతనిబంధన, కొత్త నిబంధనలు ఉన్నాయి. యూద మతానికి సంబంధించిన పాత నిబంధనను మాత్రమే యూదులు అంగీకరిస్తారు. ప్రవక్త ఈసా (అ) యూద ప్రవక్తలలో చివరి వారయినప్పటికీ కొత్త నిబంధనను వాళ్ళు అంగీకరించరు.

1. తౌరాత్ (పాత నిబంధన...మూసా ప్రవక్త (అ) పై అవతరించిన గ్రంథం.)

2. జబూర్ (డేవిడ్ పాటలు, పాత నిబంధనలో ఉన్నవి)

3. ఇంజీల్ (గ్రీకులో ఇవాంజిల్, ఇంగ్లీషులో గోస్పెల్) ప్రవక్త ఈసాపైఅవతరించింది. దీనిని క్రయిస్తవులు కొత్త నిబంధనగా పేర్కొంటారు.

➪ ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న ఈ గ్రంథాలలో దివ్యఖుర్ఆన్ ప్రస్తావనలు వేటిని సూచిస్తున్నాయో చెప్పలేము. అయితే ఈ గ్రంథాల భాగాలు మాత్రమే దొరుకుతున్నాయి. ఈ గ్రంథాలు సంపూర్ణంగా మార్పులు లేకుండా ఉన్నాయని చెప్పే పరిస్థితి లేదు. ఇందులో అనేక వైరుధ్యాలు మనకు కనబడతాయి. కాని దివ్యఖుర్ఆన్ నేటికి 1400 సంవత్సరాలుగా ఎలాంటి మార్పులు లేకుండా యథాతథంగా భద్రంగా ఉంది. – కొత్త నిబంధనకు సంబంధించిన ఇద్దరు మార్క్, లూకాలు నిజానికి ప్రవక్త ఈసాను ఆయన జీవిత కాలంలో అనుసరించిన పన్నెండు మంది శిష్యులలోని వారు కాదు. (గోస్పెల్ ఆఫ్ బార్నబాస్‌తో సహా) క్రీస్తు శిష్యులలో కొందరి రచనలను తదుపరి కాలాల క్రయిస్తవులు సందేహాస్పదమైన రాతలుగా తిరస్కరించారు.

➪ జె.సి. ఫెంటాన్, యార్క్‌షైర్‌లోని వెంత్‌వర్త్‌కు మాజీ మతాధికారి. తర్వాత ఆయన లీచ్ ఫీల్డ్ థియోలాజికల్ కాలేజికి వెళ్ళారు. ఆయన రాసిన పుస్తకం **"సెయింట్ మాథ్యూస్"** 1963 లో ప్రచురిత మయ్యింది. పెంగ్విన్ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. అందులో ఆయన ఇలా రాశారు: శిలువ వేసిన తర్వాత నుంచి గోస్పెల్ రాయబడిన సమయం వరకు గడచిన కాలంలో కొంత మంది ప్రారంభ కాలాలకు చెందిన క్రయిస్తవులు ఈసా శిలువ వేయబడలేదని,ఆయనకు బదులు మరొకరు శిలువ వేయబడ్డారని విశ్వసించారు. ఈసా శిలువపై మరణించ లేదని విశ్వ సించే క్రయిస్తవ వర్గం కూడా ఉంది. వారి అభిప్రాయం ప్రకారం, క్రీస్తు శిలువ నుంచి సజీవం గా బ్రతికి క్రిందికి వచ్చారు. 19వ శతాబ్దం ప్రారంభంలో కొందరు క్రీస్తు శిలువపై నీరసపడ్డా రని, తర్వాత రాతి సమాధి నుంచి బయటకు వచ్చారని కొత్త సిద్ధాంతాలు ప్రతిపాదించారు.



➪ ప్రాచీన కాలానికి చెందిన **'డెడ్ సీ స్క్రోల్స్'**ను ఒక అరబ్బు పశువుల కాపరి ఒక గుహలో కనుగొన్నాడు. వీటిని కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా దాదాపు నలభై సంవత్సరాల పాటు రహస్యంగా ఉంచడం జరిగింది. వీటిని పలస్తీనాకు చెందిన యూదులు రాశారని తెలు స్తోంది. ప్రవక్త ఈసా జీవిత కాలానికి రెండు శతాబ్దాల ముందు నుంచి ప్రవక్త ఈసా జీవిత కాలం వరకు వ్రాయబడిన ప్రతులివి. బైబిల్‌కు సంబంధించిన అతిపురాతనమైన వ్రాతప్రతులివే.

➪ హిబ్రూ యూనియన్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ బెన్ జిమ్ వాకోల్డర్, మార్టిన్ అబెక్‌లు ఈ వ్రాతప్రతులను రహస్యంగా ఉంచడాన్ని సవాలు చేసి వాటిని బయటకు తీయడానికి కృషి చేశారు.

2012.indd 7 11/28/12 12:05 PM



మానవ జీవిత లక్ష్యం

మానవుడు వైజ్ఞానికంగా గొప్ప అభివృద్ధిని సాధించాడు. నక్షత్రాల ఆవల లోకానికి నిచ్చెనలు వేస్తున్నాడు. అపరిచిత, సుపరిచిత ప్రాంతాలను తన కైవసం చేసుకునేందుకు ఉరకలేస్తున్నాడు. సమాచార ప్రసారానికి అతి వేగమయిన పరికరాలను కనుగొని ప్రపంచాన్ని ఓ గదిగా మార్చగలిగాడు. ఇన్ని విజయాలను సొంతం చేసుకున్న మానవుడు ఇన్ని ప్రగతి ఫలాలను అనుభవిస్తున్న మానవుడు తన ఉనికి గురించి, ఉనికి లక్ష్యం గురించి తెలుసుకోక పోవడం, కనీసం తెలుసుకునేందుకు ప్రయత్నించక పోవడం ఎంతో విచారకరం. కనిపించేదే, విని పించేదే, పంచేంద్రియాల పరిధిలో వచ్చేదే నిజమని అనుకుంటే ప్రమాదం. హేతువు మాటున చురకత్తి కదులుతుంది. మనిషి బుద్ధి మార్గం తప్పుతుంది. ఏదోక మాయ మనస్సుని క్రమ్ముకుంటుంది. సత్యదర్శనం కరువవుతుంది. కాబట్టి ఒక నిమిషం ఆగి మనల్ని మనం ప్రశ్నించుకుందాం! మనం దేని కోసం పుట్టించబడ్డాము? మన జీవిత లక్ష్యం ఏమిటి? సునిశిత మతి ఉంటే ఒక సూచన చాలు. లోతులు ముట్టే ఒక ఆలోచన చాలు. సాధారణంగా 'మానవ జీవిత లక్ష్యం ఏమిటి? అని మనం ఏ నలుగురిని అడిగామనుకోండి,వైవిధ్యమయిన సమాధానాలు వినబడతాయి. కారణం– ఆయా వ్యక్తుల ఆశయాలు, ఉద్దేశాలు ప్రాపంచికమయినవి, పరిమితమయినవి మాత్రమే కావడం. వారు పరలోకం గురించి అక్కడ వారి కర్మలకు గాను వారికి లభించే శిక్షా బహుమానాల గురించి ఆలోచించకపోవడమే.

మానవ జీవితం సప్త రంగులహరివిల్లు. మనిషి జీవితాన్ని ఏడుభాగాల్లో విభజించవచ్చు. 1) కుటుంబం. 2) ఆర్థికం 3) ఆరోగ్యం 4) ఆధ్యాత్మికం 5) వ్యక్తిగతం 6) వ్యాయామం 7) సామాజికం. నేడు మనం కేవలం ఆధ్యాత్మిక లక్ష్యం గురించి తెలుసుకోబోతున్నాము. ఎందుకంటే అదే మిగతా అన్నింటికి కేంద్రబిందువు గనక.

పెన్సిల్ ఉపమానం: ప్రతి వ్యక్తీ కొనగలిగేంతటి చౌకబారు వస్తువు పెన్సిల్. అ) మామూలపాటి ఈ పెన్సిల్ తనంటత తానుగా ఉనికిలోకి వచ్చిందా? లేదా దాన్ని తయారు చేసినవాడొకడున్నాడా? **'పెన్సిల్ తనంతట తానుగా ఉనికిలోకి రాలేదు'** అన్నది మీ అందరి సమాధానం. తేలికపాటి పెన్సిల్ తనంతట తానుగా తయారవ్వలేదు అంటే, ఈ సృష్టిబ్రహ్మాండం, అందులోని మనం ఇట్టే యాదృచ్ఛికంగా, ఒక విస్పోటనం ద్వారా ఉనికిలోకి వచ్చేశాయను కోవడం ఎంతవరకుసహేతుకం? **"అది సరేగాని, మీరు వదిలే రేతస్సు గురించి ఎప్పుడయినా ఆలోచించారా? ఏమిటి, దాంతో మనిషిని సృష్టించేది మీరా? లేక మేము సృష్టిస్తున్నామా?... సరే! మీరు నాటే వస్తువును(విత్తనాన్ని) గురించి ఎప్పుడయినా ఆలొచించారా? ఏమిటి, దాన్ని మీరు పండిస్తున్నారా? లేక దానిని పండించేది మెమా?....."**

(అల్ వాఖిఅహ్: 58–64)

అనగా సృష్టి, ఏ కర్తా లేకుండా ఉనికిలోకి వచ్చేసింది అన్నదీ సత్య దూరమే. సృష్టికి అనేక కర్తలు ఉన్నారు అనడమూ వ్యర్థ ఆలోచనే. ఇక –

అ) పెన్సిల్ రాయడం దానిలక్ష్యంగా తనకు తానే నిర్ణయించుకుందా, నిర్ణయించినవాడొకడున్నాడా? **'దాని తయారు చేసిన వాడే దాన్ని తయారు చేయక ముందే దాని లక్ష్యాన్ని నిర్ణయించాడు'** అనేది మీ సమాధానం. మరి చిన్న పెన్సిల్‌కే ఒక లక్ష్యాన్ని ఆ వస్తువు నిర్మాత నిర్దేశించినప్పుడు, సృష్టికే తలమానికమయిన మనిషి, మనిషి కోసం నిర్మించబడిన ఈ విశ్వ వ్యవస్థ ఇట్టే అర్థరహితంగా, లక్ష్యరహితంగా,గమ్యరహితంగా ఉనికి ఇవ్వడం జరిగిందా?

దివ్యఖుర్‌ఆన్, మోమినూన్ అధ్యాయం: 115వ వచనంలో మనందరి సృష్టికర్త మనల్ని ఇలా ప్రశ్నిస్తున్నాడు: **"మేము మిమ్మల్ని ఏదో ఆషామాషిగా (అర్థరహితంగా) పుట్టించామనీ, మీరు మా వద్దకు మరలి రావడమనేది జరగని పని అని భావిస్తున్నారా?"**

"(ఆ విషయానికొస్తే) మేము భూమ్యాకాశాలను, వాటి మధ్యనున్న వాటిని –ఏ ఒక్కటినీ లక్ష్యరహితంగా పుట్టించలేదు. యాదృచ్ఛికంగా పుట్టామన్నది అవిశ్వాసుల భ్రాంతి మాత్రమే". (స్వాద్: 27)

అంటే సృష్టికర్త మనిషిని ఈ భూమి మీద పుట్టించి, అతని జీవితానికవసరమయిన వస్తువులన్నింటిని సమకూర్చి పెట్టాడు. భూమి, ఆకాశం, గాలి, నీరు, నిప్పు – ఒక్కటేమిటి, పరమాణువు మొదలు పంచభూతాల వరకూ అన్నీ మనిషి సేవ కోసమే పుట్టించాడు. మరి మనిషిని దేని కోసం పుట్టించినట్టు?

దివ్యఖుర్‌ఆన్ 51వ అధ్యాయం, 56వ సూక్తిలో ఇలా సెలవియ్యబడింది: **"నేను మానవులను, జిన్నాతులను కేవలం నా ఆరాధన కోసం మాత్రమే పుట్టించాను".**

అంటే, సూర్యచంద్రనక్షత్రాలను పుట్టించి వాటి కోసం కొన్ని నియమనిబంధనల్ని నిర్ణయించినట్లే మానవులకు కూడా కొన్ని నియమనిబంధనలుపెట్టాడు. వారందరి కోసం క్రమశిక్షణతో కూడిన జీవన సంవిధానాన్ని కేటాయించాడు. ఆయన నిర్దేశించిన ధర్మం ప్రకారం జీవిస్తే – మనిషి కుటుంబ జీవనమయినా, అర్థిక, వ్యాయామ, సామాజిక, ఆరోగ్య, వ్యక్తిగత రంగాలన్నీ సక్రమంగా ఉంటాయి. ఆయా రంగాల్లో అతడు పడే శ్రమ దైవాజ్ఞబద్ధమయి ఉన్నంత కాలం పుణ్యప్రదంగా, సత్కార్యంగా పరిగణించబడుతుంది. అది తోటి సోదరునితో అతని నగుమోము సంభాషణ అయినా, ప్రేమతో భార్యకు తినిపించిన ఒక ముద్దయినా ఆరాధనగా భావించబడుతుంది. కవి మాటల్లో చెప్పాలంటే,

ఉన్నత చదువులు ఎన్ని చదివినా ఫలితముండబోదురా
సృష్టికర్తను గ్రహించలేని డిగ్రీలన్నీ వ్యర్థమురా!

దేవుడొక్కడని విశ్వసించిన జీవితమగును శాంతిమయం
దైవదాస్యం చేసిననాడు కలుగును ఇహపర సాఫల్యం!
నీకు కలుగును ఇహపర సాఫల్యం!

2012.indd 8 11/28/12 12:06 PM

మన ఆరాధ్య దైవం ఎవడు?



ఒకడే దేవుడు ఒకడే కర్త సృష్టికి ఒకడే యజమాని. ఒకటేమార్గం ఒకటే గమ్యం – ఇదే సత్యం' అని మనం తెలుసుకున్నాము? ఈ మాట ఏకేశ్వరోపాసకులు మొదలు బహుదైవారాధకుల వరకూ, క్రైస్తవులూ, యూదులు, ఫారసీలు మొదలు సృష్టి పూజారుల వరకూ అందరూ చెబుతున్నప్పుడు ఎవరు ప్రతిపాదించిన దైవాన్ని నిజ దైవంగా ఎంచాలి? ఎవరు అవలంబించే జీవన సంవిధానాన్ని అవలంబించాలి? ఏ మార్గం మనల్ని స్వర్గానికి చేర్చగలదు. అన్న ప్రశ్న తలెత్తుతుంది. "ఇక్కడయితే ప్రతి పక్షం తానే సత్య పక్షం" అని బల్ల గుద్ది మరీ చెబుతుందాయే!

విశ్వాన్ని, విశ్వంలో ఉన్న అణువ ణువును మనం సునిశితంగా పరిశీలించి నట్లయితే, స్వయంగా మన దేహాన్ని, దాని నిర్మాణ విధానాన్ని గమనించినట్లయితే మూడు విషయాలు బోధ పడతాయి.

1) సృష్టి, 2) స్థితి, 3) లయ.

1) సృష్టి: "ఆయనే ఆకాశాలనూ భూమిని సత్యబద్ధంగా సృష్టించాడు. ఏ రోజు ఆయన 'అయిపో' అని ఆజ్ఞాపించాడో అప్పుడు అది అయిపోతుంది. ఆయన మాట సత్యమయినది, ప్రభావ పూరితమయినది". (అల్ అన్ఆమ్:73)

"ఆయనే తాను కోరిన విధంగా మాతృ గర్భాలలో మీ రూపు రేఖలను మలుస్తాడు. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన శక్తి సంపన్నుడు, వివేక సంపన్నుడు కూడా". (అల్ ఇమ్రాన్: 6)

2) స్థితి: "ఆత్మ సాక్షిగా! దాన్ని తీర్చి దిద్దిన వాని సాక్షిగా! మరి ఆయన దానికి చెడును, చెడు నుండి తప్పించుకుని మసలు కునే ప్రేరణను ఇచ్చాడు" (అష్షమ్స్: 6,7)

"ప్రతి వస్తువుకూ దాని ప్రత్యేక రూపు ఇచ్చి, తర్వాత దానికి మార్గం చూపేవాడే మా ప్రభువు". (తాహా: 50)

అంటే మనిషికి శోభనిచ్చే రూపును, పశువుకు తగిన ఆకారాన్ని, విశ్వంలోని వస్తువులన్నింటికీ వాటికి అతికినట్లు సరిపోయే రూపురేఖలను ప్రసాదించిన వాడు. ప్రతి ప్రాణికీ దానిస్వభావస్వరూపాల రీత్యా బ్రతుకు తెరువును నేర్పినవాడు. మనుగడకు అవసరమయిన వాటిని సమకూర్చుకునే తెలివీ తెటలను ఇచ్చినవాడు. వాటి ప్రకారమే ఆ ప్రాణులు తమ జీవనపథాన్ని నిర్ణయించుకుంటాయి.

3) లయ: "ఆయనే ఆకాశాలు మొదలుకుని భూమి వరకూ (ప్రతి) పనిని నడుపుతున్నాడు". (అస్సజ్దా: 5)

"భూమిలో సంచరించే ప్రాణుల న్నింటికీ ఆహారాన్ని సమకూర్చే బాధ్యత అల్లాహ్‌దే. అవి ఆగి ఉండే స్థానాలు, అప్పగించబడే స్థానాలు కూడా ఆయనకు తెలుసు". (హూద్:6)

మరి ఆయన పేరేమిటి?

"నిశ్చయంగా మీ ప్రభువుఅల్లాహ్ యే. ఆయన ఆకాశాలను, భూమినీ ఆరు రోజులలో సృష్టించాడు. తర్వాత అర్ష్‌ను అధీష్టించాడు. ఆయన సమస్త వ్యవహారాలను నిర్వహిస్తున్నాడు, ఆయన అనుమతి లేకుండా (ఆయన సమక్షంలో) సిఫారసు చేయగలవాడెవడూ లేడు. ఆ మహితాత్ముడయిన అల్లాహ్‌యే మీ అందరి ప్రభువు. కాబట్టి మీరు ఆయన్నే ఆరాధించండి". (యూనుస్: 3)

ఇక ఆయన గుణగణాలేమిటి? అంటారా...

సకల దౌర్బల్యాలకు అతీతుడు అల్లాహ్:

"అల్లాహ్, ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన సజీవుడు; అన్నింటికీ మూలాధారం. ఆయనకు కునకుగానీ, నిద్ర గాని పట్టదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయన అధీనంలో ఉంది. ఆయన అనుమతి లేకుండా ఆయన సమక్షంలో సిఫారసు చేయగలవాడెవడు? వారికి ముందు ఉన్న దానినీ, వెనక ఉన్న దానినీ ఆయన ఎరుగును.ఆయన కోరినది తప్ప ఆయనకున్నజ్ఞానంలోని ఏ విషయమూ వారి గ్రాహ్య పరిధిలోకి రాదు. ఆయన కుర్సీ వైశాల్యం భూమ్యాకాశాలను చుట్టి ముట్టి ఉంది. వాటిని రక్షించడానికి ఆయన ఎన్నడూ అలసిపోడు. ఆయన సర్వోన్నతుడు, గొప్పవాడు". (అల్ బఖరా: 255)

"భూమ్యాకాశాల సార్వభౌమత్వం ఆయనదే. జీవన్మరణాల ప్రదాత ఆయనే. ఆయన ప్రతిదీ చేయగల అధికారం కలవాడు.ఆయనే మొదటివాడు, చివరివాడు. ఆయనే బాహ్యం, ఆయనే నిగూఢం. ఆయన ప్రతిదీ తెలిసినవాడు". (అల్ హదీద్: 2,3)

ఆయనే ఆది. ఆయనకంటే ముందు ఏదీ లేదు. ఆయనే అంతం.ఆయన తర్వాత ఏదీ ఉండదు.

(నా దాసులకు ఈ విషయాన్ని) తెలియజెయ్యి: "ఆయన అల్లాహ్ ఒక్కడే. అల్లాహ్ నిరపేక్షపరుడు. ఆయన ఎవరినీ కనలేదు. ఆయనా ఎవరికీ పుట్టినవాడు కాడు. ఆయనకు సరిసమానుడు ఎవడూ లేడు". (అల్ ఇఖ్లాస్: 1–4)

"ఆయన్ను పోలిన వస్తువేదీ లేదు". (షూరా: 11)

"భూమండలంలో ఉన్న వృక్షాలన్నీ కలములుగా, సముద్రాలన్నీ సిరాగా మారిపోయినా, ఆపైన మరో ఏడు సముద్రాలను కలుపుకున్నా (అవి పూర్తయిపోతాయేగాని) అల్లాహ్ వచనాలు పూర్తి కావు. నిస్సందేహంగా ఆయన సర్వాధికుడు, వివేకవంతుడు". (లుఖ్మాన్: 27)

ఆయన గుణగణాలను అంతిమ దైవగ్రంథమయిన ఖుర్‌ఆన్ వెలుగులో తెలుసుకున్నాము. ఇప్పుడు ఆయన తన దాసులనుద్దేశించి ఏమంటున్నాడో కూడా తెలుసుకుందాం!

"ఓ ప్రజలారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారిని పుట్టించిన మీ ప్రభువునే ఆరాధించండి. తద్వారానే మీరు సురక్షితంగా ఉండగలరు. ఆయనే మీ కోసం భూమిని పాన్పుగానూ, ఆకాశాన్ని కప్పుగానూ చేశాడు. ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించి, తద్వారా పండ్లుఫలాలను పండించి మీకు ఉపాధినొసగాడు. ఇది తెలిసి కూడా మీరు ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టకండి". (అల్ బఖరా: 21,22)

మనందరి ఆరాధ్య దైవం అయిన అల్లాహ్‌తో కలుసుకోవాలనీ, ఆయన దివ్య దర్శనంతో పునీతులమవ్వాలని మనలో ఎవరు కోరుకోరు చెప్పండి! మరి మన తదుపరి కర్తవ్యం ఏమిటి? అదీ ఆయన మాటల్లోనే వినండి: "కనుక తన ప్రభువును కలుసుకోవాలన్న ఆకాంక్ష ఉన్నవాడు సత్కార్యాలు చేయాలి, తన ప్రభువు ఆరాధనలో వేరొకరికి భాగస్వామ్యం కల్పించకూడదు". (కహఫ్:110)

2012.indd 9 11/28/12 12:06 PM

మన -మానవ జీవితానికి సంబంధించిన సమస్యలు అనేకం. కూడు, గూడు, గుడ్డ లాంటి మౌలిక సమస్యలతోపాటు విద్యా బుద్ధులు, సంఘం, సంస్కృతి, యుద్ధం, సంధి సమస్యలు; ధన, మాన. ప్రాణ రక్షణకు సంబంధించిన సమస్యలు...ఇలా ఎన్నో సమస్యలతో మనిషి సతమతమవుతున్నాడు. మనిషికి ఎదురయి ఉన్న ఈ సమస్యల పరిధి ఒక్కోసారి వ్యక్తికి పరిమిత మయితే, ఒక్కోసారి కుటుంబానికి, సమాజానికి, దేశానికి విస్తరించి ఉంటాయి. సమస్యలు అవి ఏ రంగంతో ముడి పడి ఉన్నై వాటిని మూడు శీర్షికల్లో విభజించవచ్చు. 1) సిద్ధాంతాలు. 2) సామాజిక సంబంధాలు. 3) చట్టం. మనం, మన నిజమైనవన్ని గ్రహించి, ఆయన ఆదేశాలకనుగుణంగా నడుచుకుంటే ఈ మూడు శీర్షికల్లో విభజితమయి ఉన్న మానవ సమస్యలు పరిష్కారం అవుతాయా? అన్న ప్రశ్నకు సమాధానమే ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం!

మన సమస్యలు తీరాలంటే...



మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారు అంతిమ దైవ ప్రవక్త ప్రభవించిన నాటికి లోకంలో అక్క డక్కడా సత్య కాంతి మిణుకుమిణుకుమని కానవచ్చినా అధికాంశం అంధకారమయం. జ్ఞానానికి మూలమయిన అక్షరం అప్పుడప్పుడు తళుక్కుమనే నక్షత్రం! మత భావాలు మూఢ నమ్మకాల దొంతరలు, సామాజిక అవగాహ నకు సూత్రం; **"గళం గలవాడిదే బలం, బలం గలవాడిదే సుఖం, సుఖం గలవాడిదే అధి కారం"** అన్నది. సమాజం తరగతుల్లో విభా జితం: పాలకులు, స్వాములు, నాయకులు. కర్షకులు, దాసులు, బానిసలు, నౌకరులు అధ మాతి అధములు! కులం, వంశం, వర్గం, వర్ణం, తెగ, పగ, కక్ష, విపక్ష సమాజంలో ప్రధాన పాత్రాధారులు; గుణం, సంస్కారం, సభ్యత, నాగరికత, నీతి, నిజాయితీలకు అక్కడక్కడా కడపటి స్థానం. ఆ చీకటి ఎడారి లో విరిసింది వెలుగొందే ఒక రోజా. దాని ఘుమఘుమలే నేటికీ జన వనంలో ఆశల తెరలను నింపుతున్నాయి. ఆ పుష్పరాజం నోట వెలవడిన సూత్రం: **"ఖూలూ లాఇలాహ ఇల్లల్లాహ్ తుఫ్లిహూ"** – మీరు అల్లాహ్ తప్ప ఆరాధ్యులు ఎవరు లేరు అన్న పరమ సత్యాన్ని త్రికరణ శుద్ధితో స్వీకరించండి, ఇహపర సాఫ ల్యాలు మీ చిరునామ తెలుసుకొని మరీ వచ్చి మీ ముంగిట వాలుతాయి. మీ సకల సమస్య లు తీరతాయి. ఏ సద్వచన కారణంగా సకల సమస్యలు తీరతాయని ప్రవక్త (స) జమానతు ఇచ్చారో ఆ సద్వచనం గురించి సర్వేశ్వరు డయిన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **"అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నువ్వు బాగా తెలుసుకో".** (ముహమ్మద్: 19) ఏమిటి, **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** అని నోటితో ఉచ్చరించడం వల్ల, మనసుతో అంగీకరించ డం వల్ల, అది విధించే పరిధులకు లోబడి జీవించడం వల్ల మానవ – మన సమస్యలు పరిష్కారం అవుతాయా? అన్న తదితర విష యాలను తెలుసుకుందాం!

1) సిద్ధాంతాలు: మనిషి పుట్టగానే ఒక ప్రత్యేక వాతావరణాన్ని గమనిస్తాడు. ఇక్కడ సూర్య చంద్రాదుల ఉదయం, అస్తమయం జరుతున్న ది. పగలు వస్తుంది, రేయి పోతుంది. నింగిలో ని తారకలు తళుక్కునమెరుస్తాయి, పుసుక్కున మాయమైపోతాయి. నేల సస్యశ్యామలంగా కళకళలాడుతుంది. ఎండి వెలవెలబోతుంది. నీరు యేరయి గలగల పారుతుంది, ఎండి పోతుంది కూడా. సృష్టిలో నిరంతరం జరిగే ఈ మార్పులు ఇట్టే దాటి పోవు.మనిషి దేహం పైనే కాకుండా ఆత్మపైనా, ఆలోచనపైన సయి తం ప్రభావం చూపుతాయి. ఉదయం ఉపాధి ఆధారమయితే, రాత్రి విశ్రాంతికి మూలం. మనిషి చుట్టూ జరిగే ఈ మార్పులు అతనికి సంతోషాన్ని, సుఖాన్నీ ఇస్తాయి. దుఃఖానికి, కష్టానికీ గురి చేస్తాయి. వీటి ద్వారా మనిషి ఆరోగ్యాన్ని పొందుతాడు, అనారోగ్యం పాలూ అవుతాడు. ఒక్కోసారి అతనికనిపిస్తుంది – తన ఆదేశం, అధికారం, భూమి, ఆకాశం, గాలి, నీరు, నిప్పు – చివరికి తన దేహం మీద సయితం లేదు అని. ఈ భావన కలగగానే ప్రపంచంలో తనకి లాభనష్టాన్ని కలుగజేసే

2012.indd 10 11/28/12 12:06 PM

ప్రతి వస్తువు అతన్ని భయపెట్ట సాగింది. ఫలితంగా మనిషి అవనిని పూజించడం ప్రారంభించాడు, అందులో ఎనలేని నిధులూ నిక్షేపాలు ఉన్నాయని. ఆకాశాన్ని దేవతగా భావించాడు, అది వరాల జల్లు కురిపిస్తుందని. పర్వతాల ముందు తల వంచాడు, అవి తనకన్నా ఎంతో ఎత్తయిన వనీ. సముద్రాలంటే ఆపాద మస్తకం వణికిపోయాడు, దాని పొగరుమోతు (సునామీ లాంటి) కెరటాలు తనను నాశనం చెస్తాయోమోననీ. ఇలా అండం మొదలు బ్రహ్మాండం వరకు – అన్నింటిని పూజించడం, గులామ్‌గిరీ చేయనారంభించాడు. దేవుడున్నాడని నమ్ముతూనే పుణ్య పురుషుల ను, సంఘసంస్కర్తలను దైవానికి సాటి చేసి కొలవనారంభించాడు. మనిషిగా పుట్టించి సృష్టిరాసుల్లోనే శ్రేష్ఠ స్థానాన్ని దేవుడు తనకిస్తే, తన అసమర్థతతో అధఃపాతాళానికి దిగజారాడు మనిషి. ఈ యదార్థాన్ని ఖుర్‌ఆన్ ఇలా అభివర్ణిస్తుంది:

"నిశ్చయంగా మేము మానవుణ్ణి అత్యుత్తమమయిన ఆకృతిలో సృజించాము. అటుపిమ్మట అతన్ని (అతని నిర్వాకాలకు బదులుగా) అధమాతి అధమ స్థానానికి మళ్ళించాము". (అత్తీన్: 4,5)

అతనిలో చోటు చేసుకున్న భయాలన్నీ అతను మనస్ఫూర్తిగా సంకల్పించుకుంటే ఒక్క సత్యంతో పటాపంచలు కాగలవు. కానీ, అతను ఆ సత్యాన్ని గ్రహించే ప్రయత్నం చేయలేదు. చేసి ఉంటే, ఈ విశ్వ వ్యవస్థను నడుపుతున్నది ఒకే ఒక్క సృష్టికర్త అని, విశ్వం మొత్తం ఆ నిజ స్వామికే తలొగ్గి మనుగడ కొనసాగిస్తుందని తెలుసుకునేవాడు. ఆ ఒక్క నిజ అధికారికి మాత్రమే భయ పడేవాడు. ఆ సత్య ప్రభువు పట్ల వాస్తవమయిన భక్తి అతన్ని సకల భయాల నుండి ముక్తి కలిగించేది. ఆ కృపాసాగరుని దాస్యం సకల దాస్య శృంఖలాలను త్రెంచేసేది. జ్ఞానోదయం కలిగిన అతను గొంతెత్తి ఇలా చాటేవాడు: నేను నింగిలో మెరిసే తారకల్ని చూశాను. అవి కొంత కాలం ఉంటాయి తర్వాత నిష్క్రమిస్తాయి. నేను పండు వెన్నెల్ని పంచే ప్రకాశమనయిన చంద్రుణ్ణి చూశాను. అదీ కనుమరుగవుతుంది. నేను బ్రహ్మాండంగా వెలిగిపోతున్న సూర్యుణ్ని చూశాను, అదీ ఓ సమయం తర్వాత అస్తమిస్తుంది. ఇలా ఒక సమయం నుండి మరో సమయం వరకూ వచ్చీపో యేవేవి దైవం కాలేవు, వాటిని నియామనుగుణంగా నడిపిస్తున్న ఆ సర్వశక్తిమంతుడే నా ఉపా సనారీతులన్నింటికీ అర్హుడు.

"నిశ్చయంగా నేను భూమి, ఆకాశాలను పుట్టించివాని వైపునకు ఏకాగ్రతతో నా ముఖాన్ని త్రిప్పు కుంటున్నాను. నేను బహుదైవారాధకుల్లోని వాడను కాను". (అన్‌ఆమ్: 79)

అంటే, మనిషిలోని మతపరమయిన, విశ్వాసపరమయిన భ్రమ, భ్రాంతులన్నింటినీ **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హులు ఎవరూ లేరు – అన్న సద్వచనం తొలగించి, అతనికి క్రాంత దృష్టిని, శాంత స్వభావాన్ని ఇస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మతపరమయిన సకల రుగ్మతలకు, దురాచారాలకు, నూతన పోకడలకు విరుగుడు **'లా ఇలాహ ఇల్లల్లాహ్'!**

ఇదో మానవ జీవితానికి సంబంధించిన కోణమయితే, మరో కోణంలో మనిషి సృష్టిలో జరిగే ఈ మార్పుల గురించి తెలుసుకున్నాడు. ఏదో అదృశ్య శక్తి ఆదేశం మేరకు నిప్పు మండుతుందని, నీరు ప్రవహిస్తుందనీ, నేల ధాన్యం పండిస్తుందనీ,, సుభిక్షమయినా, దుర్భిక్షమయినా, కలిమి అయినా, లేమి అయినా, జననం అయినా, మరణం అయినా ప్రతిదీ ఆ అదృశ్య శక్తి ఆజ్ఞకే కట్టుబడి ఉన్నాయని గ్రహించాడు. మనిషిలో పరిశోధించాలన్న ఆలోచన మొగ్గ తొడిగింది, అతని అన్వేషణ మొదలయింది. ఆ శక్తి ఏమిటో, ఎలా ఉంటుందో తెలుసుకోవాలని పరితపించాడు. ఆ శక్తిని తాను చూడలేదుగాని ఆ విశ్వకర్త శక్తి సంబంధించిన నిదర్శనాలు అడుగడుగునా దర్శనమిస్తున్నాయి. మనిషి తనకున్న పరిమిత జ్ఞానంతోనే తర్కించడం మొదలెట్టాడు – నా కళ్లకు కనబడని, నా వీనులకు వినబడని, నా పంచేంద్రియాల పరిధిలోకి రాని ఒక వస్తువును నేనెందుకు నమ్మాలి. పురోగమానికి బదులు తిరోగమం చోటు చేసుకుంది. ఈ విశ్వంలో ఎవరి పరిపాలన సాగుతుందో తెలియనప్పుడు ఆ శక్తిని అంగీకరించి ప్రయోజనం ఏమిటి? అతను గ్రహించాడు; విశ్వంలో కొన్ని సాధనాలు కలిసినప్పుడు కొన్ని ప్రత్యేక సంఘటనలు జరుగుతాయి. నిప్పు కాల్చుతుంది. నీరు వల్ల మొక్కల్లో ప్రాణం వస్తుంది. విషం మనిషిని చంపుతుంది. అమృతం మనిషిని బ్రతికిస్తుంది. ఇలా ఎందుకు జరుగుతుంది? అతనో నిర్ణయానికి వచ్చాడు. తాను ఒక ప్రత్యేక వాతావరణంలో జీవిస్తున్నాడు. ఇక్కడ అతనికి ప్రతికూలంగా, అనుకూలంగా కొన్ని శక్తులు బలంగా పని చేస్తున్నాయి. అతను మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. ఈ అనుకూల శక్తుల వల్ల ప్రయోజనం పొందడం ఎలా? ప్రతికూల శక్తుల నుండి తప్పించుకోవడం ఎలా? అన్నదే అతని ఆలోచన, అన్వేషణకు అంతిమ గమ్యంగా నిలిచింది. తాను జరిపిన పరిశోధనా మత్తులో అతను ఆ విశ్వకర్తనే నిందించాడు. ఆయనకే పోలికలు కల్పించే దుస్సాహసం చేశాడు. ఇదే విషయాన్ని సర్వేశ్వరుడయిన అల్లాహ్ ఇలా తెలియజేస్తున్నాడు: **"వాడు మమ్మల్ని (ఇతరులతో) పోల్చాడు. కానీ (మరోవైపు) తన పుట్టుకనే మరచి పోయాడు. 'కుళ్ళి కృశించిపోయిన ఎముకలను ఎవడు (రా) బ్రతికిస్తాడు?' అని (మాకే) సవాలు విసురుతున్నాడు. (ఇలా) చెప్పు: 'వాటిని తొలిసారి సృష్టించినవాడే (మలిసారి) కూడా బ్రతికిస్తాడు".** (యాసీన్: 78,79)

తన పుట్టుక ఎందు నిమిత్తం జరిగింది? తనెందుకు ఈ లోకంలో ఉన్నాడు? జీవిత గడువు ముగిశాక చచ్చి తాను ఎక్కడి వెళ తాడు? తాను చేసుకున్న పాపపుణ్యాల పర్యవసానం ఏమిటి? నిరాఘాటంగా, నిర్విఘ్నంగా, నిరంతరాయంగా ఓ కట్టుదిట్టమయిన నియమానికి లోబడి నడుస్తున్న ఈ విశ్వ వ్యవస్థ చివరికి ఏమవుతుంది? వీటి గురించి అతను అస్సలు ఆలోచించ లేదు. ఫలితం – నిజ దైవ జ్ఞానం లేని భక్తి మానవ సమాజం పాలిట ప్రమాదంగా మారినట్టే, వాస్తవదైవం పట్ల భక్తి లేని విజ్ఞానం వినాశకాలకు కారణ భూతమయింది. అదే అతను ఈ సృష్టికి కర్త ఉన్నాడు, అతను ఒక్కడే అన్న యదార్థాన్ని అంగీకరించి ఉంటే నేడు అతను వైజ్ఞానికంగా గొప్ప విజయాల్ని సాధించి కూడా పరిష్కరించుకోలేకపోతున్న అనేకానేక సమస్యలు ఇట్టే సులభంగా పరిష్కారం అయ్యేవి. అంటే దైవాన్ని విశ్వసించడంతోపాటు అనేక శక్తుల్లో విశ్వాసం గలవారు, విగ్రహారాధకులు సృష్టి పూజారులు **'లా ఇలాహ'**అంటూ సృష్టికర్త వ్యవహారంలో సృష్టిరాసుల జోక్యాన్ని నిరాకరించాలి. ఈ సృష్టికి కర్త అనేవాడే లేడు, ఉన్నా ఆతన్ని నమ్మడం వల్ల ప్రయోజనం లేదు అని అనుకునేవారు **'ఇల్లల్లాహ్'** ఒక్క అల్లాహ్ మాత్రమే ఈ సృష్టి మొత్తాన్ని నియమబద్ధంగా నడుపుతున్నాడన్న యదార్థాన్ని అంగీకరించాలి. **'లా ఇలాహ'** అన్న అనంగీకారం, **'ఇల్లల్లాహ్'** అన్న అంగీకారంతో మానవాళి సైద్ధాంతిక పరమయిన, మత పరమయిన దొంతరలు, ద్వంద ప్రమాణాలు, సమస్యలు పరిష్కారం అవుతాయి. ఇదే నేప థ్యంలో దైవ ప్రవక్త ముహమ్మద్ (స) మాన వాళిని **'ఖూలూ లా ఇలాహ ఇల్లల్లాహ్ తుఫ్లిహూ'** అని ఘంటాపథంగా పిలుపుని చ్చారు.

లా ఇలాహ ఇల్లల్లాహ్ అని
పలుకరండి ఓ ప్రజలారా!
ఒక్కడయిన ఆ సృష్టికర్తనే
మ్రొక్కండోయి జనులారా!
ఇరులు ఝరులు నింగీ నేలకు
సృష్టికర్తయే యజమాని
నిజానిజాలు తెలుసుకు మసలరా
నిండు మనసుతో ఓ భాయీ!

(మానవులందరిని దేవుడు ఒకే జాతిగా అభివర్ణించినప్పుడు మనుషుల మధ్య ఈ భేదభావాలు, వర్గాలు, వర్ణాలు, కులాలు, అంటరానితనాలు, అస్పృశ్యతలు ఎందుకున్నట్టు? ఈ సామాజిక అసమానతకు అసలు కారణం ఏమిటి? ఇవి ఇటువంటి ఇతర అనేక ప్రశ్న లకు జవాబు కావాలంటే వచ్చే సంచిక వరకు వేయిట్ చేయాల్సిందే!)

2012.indd 11 11/28/12 12:06 PM



బెర్ముడా ట్రయాంగిల్

వినోదం

బెర్ముడా ట్రయాంగిల్ ప్రాంతంలో ఒక చిత్రమయిన వాతావరణం ఉందని, దాని వలన అక్కడకు వచ్చిన ఏ వస్తువయినా మాయ మయి పోతుందని కొంత మంది శాస్త్రవేత్తల ఊహ కాగా మరి కొందరు ఆ ప్రాంతంలో అత్యంత శక్తివంతమయిన ఆయస్కాంత ధాతువులున్నాయని అవి అక్కడ కు వచ్చి నౌకలను, విమానాలను ఆకర్షిస్తున్నాయని అంటారు.

అట్లాంటిక్ మహా సముద్రం తూర్పు తీరంలో ఒక త్రిభుజాకారంలో ఉన్నది బెర్ముడా అనే ప్రదేశం. **'బెర్ముడా ట్రయాంగిల్'** అని పేరు తెచ్చుకున్న ఈ భయంకర ప్రదేశం యొక్క అసలు రహస్యాన్ని ఈనాటికీ ఎవరూ చేధించలేకపోయారు. విజ్ఞాన శాస్త్రానికి అంతుబట్టని విషయమే లేదని విశ్వసించే సైంటిస్టులు కూడా ఈ విషయంలో ఏమి తేల్చలేక పోయారు. బెర్ముడా ట్రయాంగిల్ కథ 1609లో మొదలయింది. వర్జీనియాకు చెందిన ఒకనౌక అట్లాంటిక్ సముద్రంలో పయనిస్తూ అకస్మాత్తుగా మాయమయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎనభైకి మించి నౌకలు, విమానాలు విచిత్ర పరిస్థితులలో మాయమయ్యాయి.

బెర్ముడా ట్రయాంగిల్ ప్రాంతంలో ఒక చిత్రమయిన వాతావరణం ఉందని, దాని వలన అక్కడకు వచ్చిన ఏ వస్తువయినా మాయమయి పోతుందని కొంత మంది శాస్త్రవేత్తల ఊహ కాగా మరి కొందరు ఆ ప్రాంతంలో అత్యంత శక్తివంతమయిన ఆయస్కాంత ధాతువులున్నాయని అవి అక్కడకు వచ్చి నౌకలను, విమానాలను ఆకర్షిస్తున్నాయని అంటారు. ఈ మహా విశ్వంతరాళంలో గ్రహాలను కబళించి వేసే ప్రమాదకర ప్రదేశాలున్నాయని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. వాటిని బ్లాక్ హోల్స్ అంటారు. బెర్ముడా ట్రయాంగిల్ అలాంటిది కాకపోవచ్చు.కానీ విమానాలను, నౌకలను అది మింగేస్తున్న తీరు దిగ్భ్రమ కలిగిస్తుంది.

బెర్ముడా ట్రయాంగిల్ సర్గాస్సో లాగనే శాస్త్రజ్ఞులు చేధించలేని మరొక రహస్యం పసిఫిక్ మహా సముద్రంలో ఉంది. జపాన్‌కు 8 వందల మైళ్ల దూరంలో పసిఫిక్ మహా సముద్రంలో ఒక ప్రదేశం ఉంది. దానిని **'డెవిల్ సీ'**గా వ్యవహరిస్తారు. అంటే దయ్యాల (భయాల) సముద్రం అన్న మాట. 1950 నుంచి 1954 వరకు 9 నౌకలు అటువైపు ప్రయాణం చేస్తూ అకస్మాత్తుగా మాయమయి పోయాయి. వాటికి సంబంధించిన ఆనవాళ్లు ఇంత వరకూ దొరక లేదు. 1955లో జపాన్ అధ్వర్యాన కాయోమారు - 5 అనే పెద్ద నౌకను డెవిల్స్ సీ రహస్యం చేధించడానికి వదలారు. కాయోమారు-5కు కూడా మొదటి వాటి గతే పట్టింది.

ఇవాన్ సాండర్స్ అనే ప్రకృతి శాస్త్రవేత్త బెర్ముడా ట్రయాంగిల్, డెవిల్ సీ గురించి బాగా పరిశోధన చేసి, ఇటువంటి ప్రదేశాలు భూగోళంలో మొత్తం పన్నెండు ఉన్నాయనీ, అందులో ఉత్తర, దక్షిణ ధృవాల వద్ద ఒక్కొక్క ప్రదేశమూ, మిగతావి భూమధ్య రేఖకు అటు ఇటూగా ఉన్నాయని అన్నారు. కాని అలాంటి ప్రదేశాలకు ఇప్పటి వరకు ఎవరూ పోలేదు. బెర్ముడా ట్రయాంగిల్, డెవిల్‌సీ జన సంచారం ఉండే ప్రదేశాలకు దగ్గరగా ఉండటం వలనే అవి ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని ఇవాన్ వర్ణించారు.

వాటిపై ఎన్నో నవలలు వచ్చాయి. వ్యాసాలకు లెక్కే లేదు. ఇక మూఢ నమ్మకాల్లో విశ్వాసం ఉన్న వారి సంగతి సరేసరి. అలాగే యూదక్రైస్తవులు వారికి తోచిన వ్యాఖ్యలు వారు చేస్తే, అరబ్బు ముస్లింలలో కొందరు వారి తోచిన వ్యాఖ్యలు చేసుకున్నారు. ఎవరు ఏమి చేసినా అసలు విషయమయితే ఇప్పటి వరకూ బయట పడలేదు. కాలమే తీర్పు ఇస్తుంది అన్న నిగూఢాలలో ఇదో అంతుచిక్కని నిగూఢం. నేటికీ వీడని మిస్టరీగానే ఉన్న వింత. ప్రకృతి చాలా విచిత్రమయినది. ప్రకృతిలో మనిషికి తెలియని ఎన్ని శక్తుల్ని అల్లాహ్ నిక్షిప్తం చేసి ఉన్నాడో ఆయనకే ఎరుక! విశ్వ వ్యవస్థ రహస్యాలలో మనం తెలుసుకున్నది బహు స్వల్పం మాత్రమేనంటే అతిశయోక్తి కాదు.

2012.indd 12 11/28/12 12:06 PM

– శాంతి ప్రియ

మనిషి! ఓ మనిషీ!!

మనిషి! ఓ మనిషీ!!
ఎటు నీ పయనం?
ఏది నీ గమ్యం?
పునరాలోచించుకో ఒకసారి

తల్లి గర్భాన గూడు కట్టావు
ఇహ లోకాన కాలు మోపాము
పంచభూతాల మిశ్రమం విశ్వం
విశ్వకర్తకు నిలువెల్ల నిదర్శనం
ఆది అంతాలు గల ఈ ప్రకృతి
ఆదిమధ్యాంతరహితునికి పట్టెను హారతి
విశ్వమునే పరికించిన నీవు
విశ్వకర్తనే విస్మరించావు

మనిషి! ఓ మనిషీ!!

లోక విరాట్టును మరచిన నీవు
చెట్టు పుట్టను మ్రొక్కావు
పరమదాతను ప్రక్కనబెట్టి
పాము పశువును పూజించావు
సృష్టికర్తకు తల వంచాల్సిన నీవు
సూర్యాచంద్రుల్ని ఆశ్రయించావు

మనిషి! ఓ మనిషీ!!

సత్యం గ్రహించక శృతి మించావు
కోతి కొమ్మను కొలిచావు
వాన, గాలి, నీరు, నిప్పు
హర్ కంకర్ శంకర్ అన్నావు
పంచ తత్వములకే పరవశించి
పరమాత్మనే అసలు మరిచావు

మనిషి! ఓ మనిషీ!!

వర్ణం గోత్రం అన్నావు
కుల చిచ్చునే రగిలించావు
ఇల్లు కూడా నీకుండకూడంటూ
కష్టజీవులపై ఇష్టా రాజ్యం చేశావు
శ్రామికులెవరు శాస్త్రం చదివితే
నాలుకల్నే కోయించావు
అభాగ్యులెవరు వేదం వింటే
వీనుల్లో సీసం పోసి శిక్షించావు

మనిషి! ఓ మనిషీ!!

పతి పేరుతో చితినే కూర్చావు
సతినే చితిపై పేర్చావు
రాజ్యాలేమో రాజులకంటూ
గ్రంథాల్ని బ్రాహ్మణులకిచ్చావు
వడ్డీ వ్యవస్థను వైశ్యులకిచ్చి
పేదల నడ్డీ విరగొట్టావు

మనిషి! ఓ మనిషీ!!

తిమ్మిని బిమ్మిని చేశావు
పందిని నందిని మ్రొక్కావు
ముఖాన్ని ఒకరికి అంట గట్టావు
భుజాలు ఇంకొకరివి అన్నావు
వూర్వుల్ని వైశ్యులుగా మార్చావు
పాదాల్ని శూద్రులపై రుద్దావు
మానవ జాతినే ముక్కల్ చేశావు

మనిషి! ఓ మనిషీ!!

మనిషిగా ఇది తగని విషయము
ఇది కాదు నీ మార్గము
తెలుసుకో జీవిత సత్యము
మానుకో కుటిల తత్వము

మనిషి! ఓ మనిషీ!!

కుతంత్రాల, కుమతుల వెన్ను విరిచి
వర్ణ వివక్ష విష కోరల్ని పీకి
అంటరానితనాన్ని నియంత్రించి
మనిషిని మనిషిగా గుర్తించు
మానవత్వం అని నినదించు
సత్సమాజ స్థాపనకై శ్రమించు
నిజ దైవాన్నే ఆరాధించు

మనిషి! ఓ మనిషీ!!

ఇటే సాగాలి నీ పయనం
ఇదే అవ్వాలి నీ గమ్యం



2012.indd 13 11/28/12 12:06 PM

షేఖ్ వలీద్ ఉమ్రీ

దైవభీతి (తఖ్వా)

తఖ్వా అనే పదం "విఖాయా"అనే అరబీ పదం నుంచి వచ్చింది. "తఖ్వా" అనే పదానికి నిర్వచనం 'ఆగి ఉండటం, దూరంగా ఉండటం.' ఇస్లామీయ పరిభాషలో 'దైవానికి అప్రియమైన విషయాల నుండి దూరంగా ఉండటం, దైవం తరపున నిషిద్ధం అయినవాటి నుండి ఆగి ఉండటం'.

తఖ్వా నిర్వచనం: హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర) తఖ్వా గురించి హజ్రత్ ఉబై బిన్ కాబ్ (ర) గారికి ప్రశ్నించగా ఆయన (ర) ఓ ఉదాహరణ ద్వారా వివరించారు. 'ఓ అమీరుల్ మోమినీన్! మీరు ఎప్పుడైనా ముళ్ళులతో నిండున్న దారిలో నడిచారా?' అని ప్రశ్నిస్తే, "ఔను, ఆ పరిస్థితి నాకు ఎదురయ్యింది" అని బదులిచ్చారు. 'అటువంటి దారిలో మీరు ఎలా నడుస్తారు?' అని మరోసారి ప్రశ్నించగా "నా దుస్తులను ముళ్ళులతో గుచ్చుకోకుండా వాటిని కాపాడుకుంటూ నడుస్తాను" అని జవాబిచ్చారు ఉమర్ (ర). 'తఖ్వా విషయం సైతం ఇంతే. ఎలాంటి దుష్టకార్యాలకు గురి కాకుండా, చెడు చేష్టల దరిదాపులకు పోకుండా, దైవ మార్గంలో తన జీవితాన్ని గడపటమే తఖ్వా' అని హజ్రత్ ఉబై బిన్ కాబ్ (ర) పేర్కొన్నారు.

అర్బాజ్ బిన్ సారియా (ర) ఉల్లేఖించారు: ఒక సారి మహా ప్రవక్త (స) మమ్మల్ని నమాజ్ చదివించి, కొన్ని విషయాలు బోధించారు. అటు వంటి ప్రభావితమైన హితబోధను విని మా గుండెలు సైతం ద్రవించాయి. అప్పుడు మహా ప్రవక్త(స) సహచరుల్లో ఒకరు ఇలా అన్నారు: "మీరు చెప్పిన మాటలను బట్టి చూస్తే మీరు ఎంతో కాలం జీవించరని అనిపిస్తుంది. కనుక మీరు మాకు ఏదయినా ఉపదేశించండి'. అప్పుడు మహా ప్రవక్త(స) **"అల్లాహ్ భయభక్తులను అవలం బించండి మరియు మీలో అధికారం అప్పగించబడిన పెద్దలకు విధేయత చూపండి"** అని హితవు పలికారు.

తఖ్వా ప్రాముఖ్యత: అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో పలు చోట్ల తఖ్వా ప్రాముఖ్యాన్ని తెలియపరిచాడు: **"ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్‌కు భయపడండి, మరియు ప్రతి వ్యక్తి రేపటికి తాను ఏమి చేసి పంపుకున్నాడో చూసుకోవలెను. మరియు మీరు అల్లాహ్‌కు భయ పడండి, నిశ్చయంగా మీరు చేసే పనులన్నీ అల్లాహ్‌కు తెలుసు."** (అల్ హష్ర్:18)

తఖ్వా కేవలం దైవాజ్ఞ మరియు దైవ ప్రవక్త (స) ఉపదేశమే కాదు, దైవాజ్ఞల సారాంశం మరియు ఉద్దేశం కూడానూ. దివ్యఖుర్ఆన్‌లో పలుచోట్ల తఖ్వా గురించి నొక్కి వక్కాణించ బడింది. ఉదాహరణకు: **"విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు ఏ విధంగా భయ పడాలో ఆ విధంగా భయపడండి. ముస్లిములుగా తప్ప మీరు మరణించకండి."** (ఆలి ఇమ్రాన్: 102) **"విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయ పడండి, మరియు రుజు వాక్కును పలకండి".** (అల్ అహ్‌జాబ్:70) **"మీరు మీ శక్తికి తగ్గ అల్లాహ్‌కు భయ పడండి."**

(అల్ తగాబున్:16)

ఇస్లామీయ బోధనలు, ఇస్లామీయ ఆరాధనలన్నింటి ఉద్దేశం తఖ్వాయే. ఆరాధనల గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"మానవులారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి, దీని ద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశం ఉంది."**

(అల్ బఖర:21)

ఉపవాసం ఉద్దేశాన్ని వివరిస్తూ–**"విశ్వసించిన ప్రజలారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడింది ఏ విధంగా మీకు పూర్వం ప్రవక్తలను అనుసరించేవారికి కూడా విధించబడిందో, దీని వల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది."** (అల్ బఖర : 183)



2012.indd 14 11/28/12 12:06 PM



హజ్ గురించి ప్రస్తావిస్తూ:**'ఎవరు దేవుని సూచనలను గౌరవిస్తారో, ఆ గౌరవము హృదయముల నుండి వచ్చిన భక్తియే."** (అల్ హజ్:32)

మరియు తఖ్వా అత్యుత్తమ సామగ్రి అని కూడా పేర్కొనడం జరిగింది. **"భయభక్తులు అన్నిటి కంటే ఉత్తమమైన సామగ్రి."** (అల్ బఖర:197) అలాగే ఖుర్బానీ గురించి దివ్యఖుర్ఆన్‌లో ఈ విధంగా ప్రస్తావించడం జరిగింది:**"జంతువుల మాంసముగాని, వాటి నెత్తురుగాని అల్లాహ్‌కు చేరవు. కాని మీ భయభక్తి ఆయనకు చేరుతుంది."** (అల్ హజ్:37)

నైతిక ప్రబోధనలను అధ్యయనం చేస్తే, మనకు తెలిసేదేమంటే నైతిక వ్యవస్థపు పునాది తఖ్వా ప్రాప్తిపై ఆధారపడుతుంది.**"మీరు (పురుషులు) ఉదార స్వభావంతో వ్యవహరిస్తే, అది దైవభీతికి అత్యంత చేరువయినది".** (అల్‌బఖర:237) **'మీరు న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సమానమైనది.'** (అల్ మాయిద:8)

హజ్జతుల్ వదా సందర్భానా దైవప్రవక్త(స) తఖ్వా గురించి హితబోధ చేస్తూ ఈ విధంగా సెలవిచ్చారు: **"మీరు మీ ప్రభువుకు భయ పడండి, ఐదు పూటల నమాజ్ చెయ్యండి, రమజాన్ మాసపు ఉపవాసాలు పాటించండి, మీకు ప్రసాదించబడిన దాని నుండి జకాత్ ఇవ్వండి, మీలో అధికారం అప్పగించబడిన పెద్దలకు విధేయత చూపండి, (ఇవన్నీ మీరు పాటిస్తే) మీ ప్రభువు (తయారు చేసిన) స్వర్గంలో మీరు ప్రవేశిస్తారు".** (తిర్మిజీ)

తఖ్వా సంబంధం: తఖ్వా దైవ బోధనల సారాంశం, మరియు ఇస్లామీయ బోధనలలో అతి ముఖ్యమైనది. తఖ్వా మనస్సుకు సంబంధించిన విషయం కనుక మనస్సే తఖ్వా అసలు కేంద్రం. **"ఎవరు దేవుని సూచనలను గౌరవిస్తారో, ఆ గౌరవము హృదయముల నుండి వచ్చిన భక్తియే".** (అల్ హజ్:32) **"అల్లాహ్ వారి హృదయాలను ధర్మనిష్ఠ (తఖ్వా) కోసం పరికించాడు."** (అల్ హుజురాత్:3)

పై ఆధారాలను బట్టి తెలిసిందేమంటే మనస్సు తఖ్వా కేంద్రం. మహా ప్రవక్త (స) కూడా తఖ్వా కేంద్రం గురించి వివరిస్తూ తమ సహచరుల ఎదుట ఈ విధంగా సెలవిచ్చారు: **"తఖ్వా ఇక్కడుంటుంది, అని మూడు సార్లు ఆయన (స) తమ గుండె వైపు సైగ చేశారు".** (ముస్లిం)

భయభక్తులు గలవారి గుణగణాలు:

వాస్తవానికి దైవభీతి కలవాడు ఎవడు? ఇదొక ముఖ్యమైన ప్రశ్న, ఎందుకంటే సమాజంలో ప్రతి వ్యక్తి తఖ్వాకై వివిధ ప్రమాణాలను సృష్టించుకున్నాడు. కొందరి దృష్టిలో నమాజ్ ప్రమాణమైతే, మరి కొందరి దృష్టిలో జకాత్, అలాగే కొందరి దృష్టిలో ఆరాధనలు ప్రమాణమైతే మరి కొందరి దృష్టిలో పరస్పర వ్యవహారాలు ఉన్నాయి. కాని ఓ వ్యక్తి విశ్వాసాలు, ఆరాధనలు నైతిక విలువలు, లావాదేవీలు అన్ని రంగాల్లో దైవాజ్ఞ ప్రకారం తన జీవితాన్ని గడుపుతాడు, అతనే వాస్తవానికి భయభక్తులు గలవాడు.

'సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌నూ అంతిమ దినాన్నీ, దూతలనూ, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నీ, ఆయన ప్రవక్తలనూ హృదయపూర్వకంగా విశ్వసించటం. ఇంకా అల్లాహ్ పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువుల కొరకూ, అనాథుల కొరకూ, నిరుపేదల కొరకూ, బాటసారుల కొరకూ, సహాయం చెయ్యండి అని అర్థించే వారి కొరకూ, ఖదీలను విడుదల చెయ్యటానికి వ్యయపరచటం. ఇంకా నమాజును స్థాపించటం, జకాత్ ఇవ్వటం, వాగ్దానం చేస్తే దానిని పాలించేవారు, కష్టకాలంలో, లేమిలో, సత్యానికీ అసత్యానికీ మధ్య జరిగే పోరాటంలో స్థైర్యం చూపేవారూ సత్పురుషులు.వాస్తవంగా సత్యసంధులు, అల్లాహ్ ఎడల భయభక్తులు కలవారు వీరే." (అల్ బఖర:177)

అదే విధంగా సూర ఆలి ఇమ్రాన్‌లో ఇలా వచ్చింది:

"మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు స్వర్గం వైపునకు పోయే మార్గంలో పరుగెత్తండి. ఆ స్వర్గం భూమ్యాకాశాల అంత విశాలమయినది. అది భయభక్తులు కలవారి కొరకు తయారు చెయ్యబడింది. వారు కలిమిలో, లేమిలో ఏ స్థితిలో ఉన్నా తన సంపదను ఖర్చు చేసేవారు,కోపాన్ని దిగమ్రింగేవారు, ఇతరులతప్పులను క్షమించే వారు – ఇలాంటి సజ్జనుంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం. వారి స్థితి ఎలా ఉంటుందంటే, ఎప్పుడైనా ఏదైనా అశ్లీల కార్యం వారి వల్ల జరిగిపోతే లేదా ఏదైనా పాపంచేసి, వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నట్లయితే, వెంటనే వారికి అల్లాహ్ జ్ఞాపకం వస్తాడు. అప్పుడు వారు ఆయనను తమ తప్పులు క్షమించు అని వేడుకుంటారు–ఎందుకంటే అల్లాహ్ తప్ప పాపాలను క్షమించగలిగే వాడెవడున్నాడని–వారు తాము చేసిన తప్పులను గురించి బుద్ధిపూర్వకంగా మొండివాదం చెయ్యరు". (ఆలి ఇమ్రాన్:133)

తఖ్వా లాభాలు (తఖ్వా ప్రయోజనాలు):

తఖ్వా మార్గం చాలా కఠినమైన మార్గం. ముళ్ళులతో నిండున్న మార్గం. ఆ మార్గంపై నడిచేవారు సైతం ఎన్నో కష్టాలను ఎదుర్కొంటారు. చివరికి పరలోకంలో నిశ్చయంగా వారు ఉద్యానవనాలలో ఎల్లప్పుడు హాయిగా ఉంటారు.

దివ్యఖుర్ఆన్ అధ్యయనం ద్వారా తెలిసేదేమంటే దైవం పరలోకపు సర్వ అనుగ్రహాలను దైవభీతి గలవారికే తయారు చేసి పెట్టాడు. దివ్యఖుర్ఆన్‌లో పలు చోట్లలో దీని గురించి ప్రస్తావన వచ్చింది.

"నిశ్చయంగా భయభక్తులు గలవారు సురక్షిత మైన స్థలములో ఉంటారు".(అల్‌దుఖాన్:51) ఇంకో చోట **"నిశ్చయముగా భయభక్తులు కలవారు ఉద్యానవనాలలో, భోగభాగ్యాలలో ఉంటారు".** (అల్ తూర్:17) మరో చోట ఈ విధంగా ఉంది: **"నిశ్చయముగా భక్తులు స్వర్గవనములలో కాలువలలో ఉంటారు".**

(జారియాత్:15)

అదే విధంగా **"నిశ్చయముగా భయభక్తులు గలవారికి వారి ప్రభువు వద్ద సౌఖ్యములు గల స్వర్గవనములు తప్పక గలవు."**

(అల్ కలమ్ : 34)

(మిగతాది 20వ పేజీలో)

2012.indd 15 11/28/12 12:07 PM

జీవితం ఓ పుస్తకం



"(ఇదిగో) 'నువ్వు స్వయంగా నీ జీవిత పుస్తకాన్ని చదువుకో. ఈ రోజు నీ లెక్క చూసుకోవడానికి నువ్వే చాలు." అని ప్రతి మనిషితో ప్రళయదినాన అనబడుతుంది. (బనీఇస్రాయీల్:14)"

ప్రతి మనిషి జీవితం ఒక పుస్తకాన్ని పోలి ఉంటుంది. మన ఆ పుస్తకాన్ని మనం ఎక్కడ పెట్టుకుంటున్నాము? రోజుకెన్నిసార్లు దాన్ని పరిశీలిస్తున్నాము? అందులో నమోదయిన సత్కార్యాల సంఖ్య ఎంత? దుష్కార్యాల సంఖ్య ఎంత? మనకు మింగుడు పడని అంశాలేమన్నా ఉన్నాయా? క్లిష్టతరమైన సమస్యలు ఎన్ని? ప్రశ్నల సమాధానాలు, సమస్య పరిష్కారాలు మనం దేన్నుండి రాబడుతున్నాం? ఎంత వరకు మనం తీసుకునే నిర్ణయాలు చేసే తీర్పులు ఖుర్ఆన్ మరియు హదీసు లకనుగుణంగా ఉంటున్నాయి? మన నమ్మకాల్లో నిజం, హేతుబద్ధత ఎంత వరకు? ఇలా ప్రతి ఒక్కరూ అనుదినం కనీసం 10 నిమిషాల పాటు లెక్కలు చూసుకుంటూ ఆత్మవిమర్శ చేసుకుంటూ, ఆత్మను ప్రక్షాళణం గావించుకుంటూ అవసరమైన మార్పుచేర్పులు దైవాభీష్టం ప్రతిపాదికన చేసుకుంటూ సాగిపోవడమే జీవితం.

మన జీవిత పుస్తకంలో ముఖ్య కథాంశం దైవ ప్రసన్నత, దైవప్రవక్త విధేయత, లోకోద్ధరణ,మనస్సంతృప్తి, ఆత్మ శాంతి, స్వర్గ ప్రాప్తి. వాటి ని సాధించుకోవడం కోసం మనం అవసరమైన ప్రణాళికలు ఏర్పర్చు కోవాలి. పట్టుదల, అంకితభావం, క్రమశిక్షణలను అలవర్చుకోవాలి. ఈ మూడు ఉంటే దేన్నయినా-జన్నతుల్ ఫిర్‌దౌసిల్ ఆలానయినా, దైవ ప్రవక్త(స) వారి సాహచర్యాన్నయినా, దైవ దర్శనా భాగ్యాన్న యినా సాధించుకోవచ్చు. అప్పుడు మనం ఐహికంగానూ, పారలౌకి కంగానూ స్థితప్రజ్ఞత స్థాయికి ఎదిగే అవకాశం ఉంది. నేడు ఎటు చూసిన ప్రగతి సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. కేవలం మానవుడు ప్రవేశ పెట్టిన సిద్ధాంతాలతోనే మనిషి ఇన్ని విజ యాలు సాధిస్తుంటే-అల్ హమ్దులిల్లాహ్ మన వద్ద అన్నింటికన్నా మేలైనవి, ఘనతరమైనవి మహోత్కృష్టమయిన మాధవుడిచ్చిన సిద్ధాంతాలున్నాయి. అంటే విజయ అవకాశాలు మనకే ఎక్కువ గా ఉన్నాయి. కాని, మనకు అల్లాహ్ అనుగ్రహించిన మహిమా న్విత గ్రంథరాజం ఖుర్ఆన్ పట్ల మన బిహేవియర్ ఎలా ఉంది?

ఎవరో ఎక్కడో ఉంటారు.బంగారు భవిష్యత్తు గురించి కలలు కనేవారు! ఏం చెయ్యాలి అన్న సందిస్థంలో కొట్టుమిట్టాడే వారు! దారి తోచని వారు! తమ మీద తాము నమ్మకం కోల్పోయిన వారు! నిరుత్సాహ ఊబిలో లోతు గా కూరుకుపోయినవారు! 'నేను ముస్లిం' అని చెప్పుకోవడానికే సిగ్గు పడిపోయేవారు! ఆత్మ న్యూనతతో, వంచనతో, ద్రోహంతోనే జీవించేవారు! అలాంటి వ్యక్తులందరికి ఈ కథ కనువిప్పు కాగలగాలి.

పూర్తిగా నిరాశ నిస్పృహలకు లోనవడం ఒక విశ్వాసి లక్షణం ఎంత మాత్రం కాదు. అది ఒక మోమిన్‌కి శోభించని విషయం. ఒక బలహీన క్షణంలో ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన- ఏ ఒక్క విశ్వాసికి రాకూడదు. పరిస్థితి ఎంతో విష మించిపోయినా సడల ని విశ్వాసంతో ఆత్మ స్థయిర్యంతో, మనో ధైర్యంతో వారు తమ జీవితాన్ని శూన్య (0 అనుకుంటున్న) స్థితి నుండి మళ్ళీ పునర్నిర్మిం చుకోవాలి. ఈ కథ వారిలో ఒకరికైనా ప్రేరణ కలిగిస్తే శ్రమ ఫలించినట్లే..!!

2012.indd 16 11/28/12 12:07 PM

మనం ప్రవక్త ముహమ్మద్ (స) వారి ఆదర్శాల్ని ఏ మేరకు ఫాలో అవుతున్నాము? మనం సమాజంలో ఎలాంటి విలువలతో జీవిస్తున్నాము? జనం మన గుణాల్ని మెచ్చుకుంటున్నారా? లేక 'ఛీ' కొడుతున్నారా? మరోలా చెప్పాలంటే వారు మన సాహచర్యాన్ని సాహసాన్ని ఇష్టపడుతున్నారా? లేక మన ప్రవర్తన వల్ల కష్టాల పాలవుతున్నారా? ప్రేమ గొప్పదంటారు కొందరు. త్యాగం గొప్పదని కొందరంటారు. ప్రేమ త్యాగాలతోపాటు ఇతరులచే ప్రేమించబడటం, వారికి ఆదర్శం కాగలటం ఇంకా ఇంకా గొప్పదన్నది నిర్వివాదాంశం.

నేడు మహా ప్రవక్త (స) అంటే ప్రాణం ఇచ్చే వారి సంఖ్య అక్షరాల 170 కోట్లు అంటే ఎలా సాధ్యమయింది? అందులో అణుమాత్రమైనా మనకు దక్కాలంటే శీలత, సౌశీల్యం, సాత్వికం, అంతర్ సౌందర్యం, పరిశుద్ధత, క్రమ శిక్షణ, సమయపాలన, మృదుమధుర సంభాషణ, చిరునవ్వు పెద్దరికం, దైవవిధేయత,పాపభీతి, పుణ్యప్రీతి....ఇవన్నీ మన సాహచర్యాన్ని ఇతరులు ఇష్టపడేలా చేస్తాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. అప్పుడు మానవుడే కాకుండా, దైవదూతలే కాకుండా, పశుపక్షాదులే కాకుండా, భువన గగనాలే కాకుండా, స్వయంగా మాధవుడు సయితం మనల్ని ఇష్టపడి కీర్తి శిఖరంపై నిలబెడతాడు. అదే మనందరి అసలు సాఫల్యం! మానవులందరి జీవిత లక్ష్యం! కాబట్టి సమాజ సంస్కరణ, శ్రేయం నిమిత్తం నియుక్తులమయిన మనం ముస్లింలుగా జీవిస్తున్న మనం లోకం ఏదో చెబుతుందని కృంగిపోనవసరం లేదు. పొగిడితే పొంగిపోనవసరం లేదు.మనం నమ్మిన ధర్మం,జీవన విధానం ఇస్లాం. అది ఎంతో గొప్ప ధర్మం. మహోత్కృష్ట జీవన సంవిధానం. **'చేసుకున్న వారికి చేసుకున్నంత'** అన్నట్టు మనం ఎంత గానైతే ధర్మానికి కట్టుబడి ఉంటామో అంతే మంచి ఫలితాలు అల్లాహ్ మనకిస్తాడు. అంతే గానీ, ఆచరణలు మాని నేతి బీరకాయలో నెయ్యి ఉండదన్న చందాన వ్యవహరిస్తూ – నేపాన్నంతా ఇతర వర్గాల వారి మీద నెట్టే ప్రయత్నం చేయడం అవివేకం! గెలుపు మన సొంతం కావాలంటే లోపం రాజకీయాలలోనూ, యూదులలోనూ, క్రైస్తవులలోనూ లేదు. అది మన చేతకానితనం అంతే!

మధుర స్మృతులు

ఎత్తైన హోటల్ 21 వ అంతస్థు (మెరిడాన్) మీద నిలబడి కిటకీలోంచి కాబా ముద్ద మనోహర దృశ్యాన్ని చూస్తున్నారు. ఆ నలుగురు. గతంలోకెళితే వారి ఊరు ఓ పల్లెటూరు. **'పసిడి పల్లె'** దాని పేరు.అది వారి బాల్య దశపు మాట. బాల్యం అనగానే ప్రతి వ్యక్తికీ గతంలో జరిగిన సంఘటనలు గుర్తుకొస్తాయి. అందులో తీపి జ్ఞాపకాలూ ఉంటాయి. చేదు అనుభవాలూ ఉంటాయి. కానీ ఒక్కటి మాత్రం నిజం.బాల్యంలోని ప్రతి సంఘటన, ప్రతి అనుభవం మనిషిపై ఎంతో కొంత ప్రభావాన్ని తప్పకుండా చూపిస్తుంది..! అదే ఆ నలుగురి విషయంలోనూ జరిగింది.

విత్తనాలన్నీ ఒకే చెట్టుదే అయినా, ఆ విత్తనాలు నేలలో పాతగా వచ్చిన మొలకలు మాత్రం కొన్ని బలహీనంగా, కొన్ని బలంగా ఉంటాయి. కొన్ని మహా వృక్షాలవుతాయి. కొన్ని మొదట్లోనే మరణిస్తాయి. నేలసారం, వర్షపాతం దీనికి కారణం. ప్రతి బాలుడూ విత్తనం లాంటివాడు. బాల్యంలో పెంపకం, స్నేహబృందం, పరిసరాలు, నేలసారం, వర్షపాతం లాంటిది– అతనికి భవిష్యత్తుని అవే నిర్దేశిస్తాయి. సహజత్వానికి, ప్రకృతి నైజానికి పోలిన ఓ గొప్ప ప్రవచనం ఒకటి ప్రవక్త (స) ప్రబోధించారు: **"పుట్టే ప్రతి శిశువు ప్రకృతి ధర్మం మీదే పుడుతుంది. కానీ, ఆ శిశువు తల్లిదండ్రులు దానికి (అతనికి) మజూసీగానో, యూదునిగానో, క్రైస్తవునిగానో (అసత్య రంగులు పులిమి) దాని సహజత్వాన్ని పాడు చేస్తారు."** అసత్యం – అది ఎన్ని రంగులు పులుముకున్నా ఎప్పుడు గెలిచిందని? గెలుపు, అంతిమ విజయం సత్యానికే సొంతం! ఓటమి అసత్యం నుదుట చెరగని కళంకం!! సత్యం వచ్చేశాక అది వైదొలగక మానదు, అంతమవక తప్పదు.

స్వర్ణకార ధ్వని

ఇనుమును బంగారం చేసే విద్యకు సంబంధించిన మాట కాదు ఇది. పదం పలికితే ప్రాణాలను ఝుమ్మనిపించే నాదం, నినాదానికి మృదంగానికి సంబంధించిన మాట అది. ఆ నలుగురుండే వీధిలోనే **'జమాల్'**అనే ఓ పండితుడుండేవాడు. ఆయన కొడుకు వహీదుద్దీన్. ఈ నలుగురు మంచి మిత్రులు. వహీదుద్దీన్ నాన్న ప్రతి రోజు ఫజ్ర్ నమాజు అనంతరం పిల్లలందరికి ఖుర్ఆన్ నేర్పించేవాడు. ఖుర్ఆన్ వినాలన్న కోరిక ఆ నలుగురులోనూ బలంగా ఉండేది. అయితే ఎవరి ఇంటి సమస్యలు వారికుండేవి. అవ్వ చేసిన దోశలు ఉదయాన్నే వెళ్ళి అమ్ముకు రావడం ఒకడి పనయితే, గొడ్ల కోసం గడ్డి త్రవ్వుకుని వచ్చే పని ఇంకొకడిది. కుదిరేది కాదు. అప్పుడప్పుడు సందు దొరికినప్పుడల్లా ఇంటివారి కళ్ళు గప్పి వెళ్ళి కూర్చుని వినేవాళ్ళు. వారి ఇంట్లో ఖుర్ఆన్ పారాయణ ధ్వని తరంగాలు మృదుమధరంగా వినిపించేవి. ఆ నలుగురూ వాటిని లోలోన ప్రాక్టీసు చేసేవారు. అదొక పవిత్ర భావన. వింత వినూత్న ప్రేరణ. ఆ క్షణాలు వారి బాల్యపు మరుపురాని మధుర ఘట్టాలు. తరువాత అదే ఖుర్ఆన్ వారి సర్వస్వం అయింది. వారిని అది కొత్త లోకంలో విహరిస్తూ కొత్త కలలు కనే శక్తి అయింది. తరువాత జీవితంలో వారిని మనిషిని, మహా మనీషిని చేసింది ఆ పవిత్ర భావనే. వారి వారి కుటుంబ నేపధ్యంలో చోటు చేసుకున్న సర్వ భ్రమల్ని, సమస్త భయాల్ని కూలదోసి, వర్గ తగాదాల్నుంచి వారిని రక్షించి పునీతుల్ని చేసింది ఆ పవిత్ర భావనే. వారిని వారు తెలుసుకునేటట్లు వారిని తీర్చిదిద్దింది. అదే వారికి కొత్త కళ్ళనిచ్చింది. కొత్త ఆశయాల్ని ఇచ్చింది. కొత్త జీవితాన్నిచ్చింది. అది వారిని సత్య పిపాసులుగా, శాంతికాములుగా మార్చింది. అదే వారి కర దీపిక అయ్యింది. అదే వారి సత్యతా కవాలం అయింది. ఖుర్ఆన్ లేకపోతే తాము లేము అన్న స్థాయికి వారిని చేర్చింది. వారి జీవితానికి పర్యాయ పదం ఖుర్ఆన్. వారి జీవితానికి జీవనాడి ఖుర్ఆన్.

ఇంతకీ ఆ నలుగురి పేర్లు ఏమిటంటారా? లెసిన్, ఏసోబు, సంజయ్, ప్రేమ్ సింగ్. పై చదువులకని వేర్వేరు ప్రాంతాలకు వెళ్ళిన ఆ నలుగురు చదువులు పూర్తి చేసుకొని కొన్ని లక్ష్యాలతో స్వగ్రామానికి తిరిగి వచ్చారు. అక్కడి నుండి మొదలయ్యాయి వారందరి మహా ప్రస్థానానికి సంబంధించిన మినీ ప్రస్థానాలు!!

వారితో పాటు వారి ఆలోచనలూ పెద్దయ్యాయి. బాల్యంలో లేని అనేక అపోహలు, అపార్థాలు ప్రశ్నోపనిషత్తులు కూడా వాటి సరసనే పెరిగాయి!!! ఒక్కొక్కరి ఆలోచించే తీరు వేర్వేరుగా తయారయింది. ఇది ఖచ్చితంగా పరిస్థితుల, పరిసరాల, పాఠ్య పుస్తకాల ప్రభావం అనడానికీ వీలు లేదు. కాదనడానికీ ఆస్కారం లేదు. మరి వారి ఈ జీవిత పయనానికి ముగింపు ఏదో వారిలో ఏ ఒక్కరికీ తెలీదు. ఎలా ఉన్నా ఇలా ఉంటుందని మాత్రం వారు ఊహించలేదు. ఇంతకీ జరిగిందేమిటి?

(సశేషం)

2012.indd 17 11/28/12 12:07 PM



జుమా ఆదాబులు ఆదేశాలు

జుమా నమాజు

అబూ హురైరా(ర) కథనం ఆయన దైవప్రవక్త(స) వారిని ఇలా చెబుతుండగా విన్నారు: "రేపు ప్రళయ దినాన అందరి తర్వాత వచ్చి అందరికన్నా ముందుండే సముదాయం మనమేఅవుతాము. యూద క్రైస్తవులకు మన కన్నా ముందు గ్రంథం ఇవ్వబడింది, ఈ (జుమా) రోజే వారిపై ఆరాధన విధిగావించబడింది. వారు ఆ విషయంలో విభేదించుకున్నారు.ప్రతి విషయంలోనూ ప్రజలు మన వెనకాలే ఉంటారు. మనల్నే అనుసరిస్తారు. "యూదులు రేపు, క్రైస్తవులు మర్నాడు" అన్నారు.

(బుఖారీ 836, ముస్లిం 855)

జుమా నమాజు హిజ్రత్‌కి పూర్వం మక్కాలో విధి గావించబడింది. అయితే మక్కాలో ఉన్నంతకాలం అది స్థాపించ బడలేదు. కారణం ప్రవక్త (స) వారి సహచరులు చాలా దయనీయ స్థితిని ఎదుర్కుంటూ ఉండేవారు గనక. హజ్రత్ అస్‌అద్ బిన్ జరారా(ర) గారు ప్రవక్త(స)వారి మదీనా ఆగమనానికి (హిజ్రత్‌కి) పూర్వమే మదీనాలో జుమా నమాజు స్థాపించారు. కాబ్ బిన్ మాలిక్(ర) గారి కథనం ద్వారా మనకీ విషయం బోధపడుతుంది.

ఆధారం:

"ఓ విశ్వాసులారా! శుక్రవారం నాడు నమాజు కొరకు అజాన్ పిలుపు ఇవ్వబడినప్పుడు మీరు అల్లాహ్ ధ్యానం వైపు పరుగెత్తండి. క్రయవిక్రయాలను వదలిపెట్టండి. మీరు గనక తెలుసుకోగలిగితే ఇది మీ కొరకు ఎంతో మేలైనది". (జుమా:9)

అబూ హురైరా(ర) మరియు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) కథనం మేరకు వారిరువురూ ప్రవక్త(స) వారిని వేదిక మీద ఈ విషయం చెబుతుండగా విన్నారు: "ప్రజలు జుమా నమాజులు వదలడం మానుకోవాలి లేదా అల్లాహ్ వారి హృదయాలకు ముద్ర వేస్తాడు. ఫలితంగా వారు శాశ్వతంగా ఏమరుపాటుకు లోనయ్యే ప్రమాదం ఉంది." (ముస్లిం 865)

జుమా నమాజు షరీయతు బద్ధం చేయడం వెనకాల పరమార్థం:

జుమా నమాజు విధి చేయడం వెనకాల అనేక ప్రయోజనాలున్నాయి. వాటిలో ప్రధానమయినవి– పట్టణంలో నివసించే, ఊరిలో నివసించే ప్రజలంతా పరస్పరం ఒక చోట కలుసుకోవటం. ఆ ప్రదేశమే జామె మస్జిద్. ఈ కలుసుకోవడం అనేది వారానికోసారి జరుగుతుంది. వారందరూ ధర్మోపదేశాన్ని వినేందుకు హాజరవుతారు. అలా వారు ప్రోగవ్వడం వారి మధ్య ఐకమత్యాన్ని, సోదరభావాన్ని మరింత దృఢతరం చేస్తుంది. ఈ కారణంగానే ఇస్లాం జుమా నమాజు కోసం హాజరవ్వమని ప్రోత్సహించింది. దాన్ని విడనాడటం నుంచి వారించింది.

జుమా విధి అవ్వడానికి షరతులు

1. ముస్లిం అయి ఉండాలి 2.యౌవనస్తుడయి ఉండాలి 3. బుద్ధిమంతుడయి ఉండాలి 4. స్వతంత్రుడయి ఉండాలి బానిస మీద జుమా వాజిబ్ కాదు.5. పురుషుడయి ఉండాలి. స్త్రీలపై వాజిబ్ కాదు 6. దేహ ఆరోగ్యం కలిగి ఉండాలి. వ్యాధిగ్రస్తుని మీద జుమా లేదు 7. జుమా నిర్వ హించబడుతున్న ప్రదేశంలో నివాసం (స్థానికుడయి) ఉండాలి. బాట సారిపై నమాజు లేదు. అలాగే స్థానికుడు సయితం జుమా నెరవేరని ప్రదేశంలో ఉంటే జుమా అతనిపై వాజిబ్ కాదు. ఉదాహరణకు: ముగ్గురికన్నా తక్కువ ముస్లిం జనాభా గల ఊరిలో అతనున్నాడు, దాంతోపాటు ఏ సమీప పట్టణంలోనయితే జుమా నిర్వహించబడుతుందో అక్కడి అజాన్ సయితం విన్పించడం లేదంటే అలాంటి వ్యక్తిపై జుమా వాజిబ్ కాదు.

తారిఖ్ బిన్ షిహాబ్ (ర) గారి కథనం– దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "జుమా నమాజు సామూహికంగా చేయడం ముస్లిం అయిన ప్రతి వ్యక్తిపై తప్పనిసరి విధి. అయితే నలుగురికి మినహాయింపు ఉంటుంది: బానిస, స్త్రీ, ప్రాజ్ఞ వయసుకు చేరని బాలుడు, వ్యాధిగ్రస్తుడు."

(అబూ దావూద్ 1067)

మరో ఉల్లేఖనంలో ప్రవక్త(స) ఇలా అన్నారు: **"అజాన్ విన్న ప్రతి ముస్లింపై జుమా విధి అవుతుంది."** (అబూదావూద్ 1056)

దైవ ప్రవక్త(స) మరియు ధర్మ ఖలీఫాల కాలంలో జుమా నమాజు కేవలం పట్టణాల్లో మాత్రమే నిర్వహించబడేది. పట్టణ చుట్టు ప్రక్కల నివసించే తెగల వారికి జుమా నమాజు కోసం రావలసిందిగా ప్రవక్త (స) కోరలేదు.

జుమా సమయం

పై ఏడు షరతులు పూర్తయితే జుమా నమాజు విధి అవుతుంది. జుమా నమాజు జుహ్ర్ నమాజు సమయంలో చేయబడుతుంది. ఒకవేళ అలా కుదరకపోతే వారు నాలుగు రకాతులు చదవుకోవాలి.

హజ్రత్ అనస్ (ర) గారి కథనం– దైవ ప్రవక్త (స) **'పొద్దు వాలే సమయంలో జుమా నమాజు చేసే వారు'.** (బుఖారీ–862)

హజ్రత్ సహల్ బిన్ సఅద్ (ర) గారి కథనం – **"మేము మధ్యాహ్న భోజనం గానీ, ఖైలూలా (కునుకుపాటు) గానీ జుమా నమాజు అనంతరమే చేసేవారము".** (బుఖారీ – 897)

ఒకే పట్టణం అనేక జుమాలు నిర్వహించకూడదు. వీలయినంత వరకూ పట్ట ప్రజలంతా ఒకే చోటు జుమా నమాజు చేసే ప్రయత్నం చేయాలి. ఒకవేళ స్థలం సరిపోవకపోతే అప్పుడు ఒకటికి మించిన జుమాలు ఒకే పట్టణంలో చేసుకునే అనుమతి ఉంటుంది. ఈ షరతు పరమార్థం ఏమిటంటే, జుమా ముఖ్యోద్దేశం అయిన ఐక్యత.

జుమా ఫర్జ్‌లు

మొదటిది: రెండు ఖుత్బాలు

1) ఈ రెండు ఖుత్బాల్లోనూ సాధ్యమయినంత వరకూ నిలబడాలి. ఈ రెంటికి మధ్యలో కూర్చోవడం ద్వారా వాటిని వేరుపర్చవచ్చు.

హజ్రత్ జాబిర్ (ర) గారి కథనం– "నిశ్చయంగా దైవప్రవక్త (స)

2012.indd 18 11/28/12 12:07 PM

నిలబడి ఖుత్బా ఇచ్చేవారు. ఆ తర్వాత కూర్చునేవారు. తిరిగి మళ్ళి నిలబడి ఖుత్బా ఇచ్చేవారు". (ముస్లిం: 862)

2) ఆలస్యం మంచిది కాదు: జుమా నమాజు గురించి వచ్చిన అనేక హదీసుల ఆధారంగా, మరియు ఈ విషయంలో ముస్లింలం దరి ఏకాభిప్రాయం కారణంగా ఖుత్బాను ఆలస్యం చేసి చెప్పకూడదు.

3) ఖతీబ్ (ప్రసంగీకులు) హదసె అస్గర్, మరియు హదసె అక్బర్ నుండి శుద్ధి పొంది ఉండాలి. అలాగే స్థలం, దేహం, దుస్తులు సయితం పరిశుభ్రంగా ఉండాలి. మర్మావయవాలు కప్పబడి ఉండాలి.

4) ఖుత్బా అర్కానుల మధ్య క్రమాన్ని పాటించడం: మొదటి మరియు రెండవ ఖుత్బాకి మధ్య, రెండవ ఖుత్బా నమాజుకి మధ్య క్రమాన్ని పాటించాలి (ఒకటి తర్వాత ఒకటి వెను వెంటనే చేయాలి). ఒకవేళ మొదటి మరియు రెండవ ఖుత్బాకి మధ్య విరామం సుదీర్ఘమయినా, రెండవ ఖుత్బా మరియు నమాజుకి మధ్య విరామం సుదీర్ఘమయినా ఖుత్బా నెరవేరదు. దాన్ని నివారించగలిగేంత సమయం ఉంటే మళ్ళీ వాటిని చేయాలి. సమయం అయిపోతే జుమా స్థానం లో జుహ్ర్ నమాజు చేసుకోవాలి.

5) ఖుత్బా అర్కానులు హెచ్చు స్వరంతో ఇవ్వాలి.

ఖుత్బా అర్కానులు

1) అల్లాహ్ స్తోత్రం; స్తోత్రం క్రిందికి వచ్చే ఏ పదాలతోన యినా సరే.

2) ప్రవక్త ముహమ్మద్ (స) వారిపై దరూద్. దరూద్‌గా వచ్చిన ఏ పదాలతోనయినా సరే. అయితే షరతు ఏమిటంటే స్పష్టంగా ఆయన పేరును ఉచ్చరించాలి; దైవప్రవక్త, సందేశహరుడు లేదా ముహమ్మద్ అని. పేరుకి బదులు సూచనా ప్రాయంగా ఏదయినా పదాన్ని వాడ కూడదు.

3) దైవభీతిని గురించి హితవు పలకడం, ఎలాంటి పదాలు, పద్ధతితో నయినా.

ఈ మూడు ఖుత్బా అర్కానులు అనబడతాయి. వీటిని ప్రస్తావించ కుండా ఖుత్బా నెరవేరదు.

4) రెండు ఖుత్బాలలో ఏదోక ఖుత్బాలో ఖుర్‌ఆన్ వచనాన్ని చద వడం: చదివే ఆయతు స్పష్టంగా, అర్థమయ్యేలా ఉండాలి. సూరా ప్రారంభంలో వచ్చే అక్షరాలను చదివితే సరిపోదు.

5) రెండవ ఖుత్బాలో ముస్లింలందరి కోసం దుఆ చేయాలి.

రెండవది: సామూహికంగా రెండు రకాతుల నమాజు చదవడం.

హజ్రత్ ఉమర్ (ర) ఇలా అన్నారు: "దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారి మాట ప్రకారం–"జుమా నమాజు రెండు రకాతులు".

(నసాయీ –111/3)

జుమా ఆదాబులు (మర్యాదలు)

1) గుసుల్ – స్నానం

2) శరీరాన్ని మలీనాల నుండి శుభ్ర పర్చుకోవడం. పురుషులు సువాసన పూసుకోవడం, నూనె రాసుకోవడం.

హజ్రత్ సల్మాన్ ఫారసీ (ర) గారి కథనం – దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: **"ఎవరయినా జుమా రోజు గుసుల్ చేసి, వీలయినంత వరకు పరిశుభ్రతను పాటించి, నూనె రాసుకొని, తన ఇంటి నుండి సువాసన పూసుకొని నేరుగా మస్జిద్‌కు వెళ్ళి ఏ ఇద్దరి మధ్య చీలిక ఏర్ప రచకుండా, అక్కడ తాను చేయగలిగినన్ని నమాజులు చేసి, ఆ తర్వాత ఇమామ్ మాట్లాడేటప్పుడు మౌనంగా ఉంటే గత జుమా నుండి ఆజుమా వరకు అతని వల్ల జరిగిన పాపాలన్నీ మన్నించబడతాయి".**

(బుఖారీ – 843)

3) మంచి దుస్తులు ధరించడం.

4) గోళ్ళు కత్తిరించడం, ఎంట్రుకలు సవరించుకోవడం.

5) తొందరగా మస్జిద్‌కు బయలుదేరడం.

హజ్రత్ అబూ హురైరా (ర) గారి కథనం: దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఎవరయితే జుమా రోజు లైంగిక అశుద్ధావస్థ నుండి పరిశుద్ధత పొందడానికి చేస్తున్నంత చక్కగా స్నానం చేసి జుమానమాజు చదవడానికి ప్రథమ సమయంలో వెళతాడో అతడు ఒక ఒంటెను ఖుర్బానీ ఇచ్చినట్లు. ద్వితీయ సమయంలో వెళ్ళిన వ్యక్తి ఒక ఆవును ఖుర్బానీ ఇచ్చినట్లు. త్వితీయ సమయంలో వెళ్ళిన వ్యక్తి కొమ్ములు తిరి గిన పొట్టేలును ఖుర్బానీ ఇచ్చినట్లు. నాల్గవ వేళలో వెళ్ళిన వ్యక్తి ఒక కోడిని ఖుర్బానీ ఇచ్చినట్లు. ఐదవ సమయంలో వెళ్ళిన వ్యక్తి ఒక గ్రుడ్డును దానం చేసినట్లు. ఆ తర్వాత ఇమాము (ఖుత్బా ఇవ్వడానికి) బయలుదేరి రాగానే దైవదూతలు(హాజరు వేయడం ఆపి) హితోపదేశం వినడానికి మస్జిద్‌లోకి వచ్చేస్తారు". (బుఖారీ – 841, ముస్లిం – 850)

6) మస్జిద్‌లో ప్రవేశించినప్పుడు రెండు రకాతులు నమాజ్ చేసుకోవాలి: హజ్రత్ జాబిర్ (ర) గారి కథనం – దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: **"మీలోని ఒకరు జుమా నమాజు కోసం వచ్చినప్పుడు ఇమామ్ ప్రసం గిస్తుంటే, రెండు రకాతులు చదువుకోవాలి, వాటిని తెలికపాటివిగా చేసుకోవాలి".** (ముస్లిం–875)

ఈ అనుమతి ఇమామ్ తన ప్రసంగాన్ని ముగిసే సమయంలో అయితే ఉండదు, అతను ఫర్జ్ నమాజు కోసం వేచి చూడాలి.

7) రెండు ఖుత్బాల కోసం మౌనం:

హజ్రత్ అబూ హురైరా (ర) గారి కథనం – దైవ ప్రవక్త (స) ఇలా ప్రవ చించారు: "జుమా రోజున ఇమామ్ ఖుత్బా ఇచ్చే సమయంలో నీవు నీ సోదరుణ్ణి ఊరుకో అని చెప్పినా అది అనవసర చర్యగా భావించబడు తుంది". (బుఖారీ–82,ముస్లిం–851)

జుమా దిన మర్యాదలు

1) సూరయె కహఫ్ పారాయణం

2) ఆ పగలు రాత్రి అత్యధికంగా దుఆ చేయడం.

దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "జుమా రోజు ఒక ఘడియ ఉంది. ఆ ఘడియలో విశ్వాసి నిలబడి నమాజు చేస్తూ – అల్లాహ్‌తో ఏదయినా కోరితే అది అతనికి అనుగ్రహించబడుతుంది".

(బుఖారీ– 852)

1) జుమా రేయింబవళ్ళలో దైవప్రవక్త (స) వారి మీద అత్యధికంగా దరూద్ పంపాలి:

దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "మీ రోజులలో అత్యంత శ్రేష్ఠమైన రోజు శుక్రవారం. కనుక మీరు ఆ రోజు అత్యధికంగా నాపై దరూద్ పంపించండి. నిస్సందేహంగా మీరు పంపే దరూద్ నాకు చేరవేయబడుతుంది".(అబూ దావూద్–1047)

2012.indd 19 11/28/12 12:07 PM

దైవభీతి 15వ పేజీ మిగతా భాగం

"నిశ్చయముగా భయభక్తులు గలవారికే సాఫల్యము గలదు."
(అన్ నబా: 31)

పరలోకంలో దైవభీతి గలవారికి ఓ వెలుతురు ప్రసాదించడం జరుగుతుంది, దాని ద్వారా వారు తమ పరలోక ప్రయాణాన్ని సాగిస్తారు.**"ఓ విశ్వాసులారా! దేవునికి భయపడండి, మరియు అతని ప్రవక్తను విశ్వసించండి, అల్లాహ్ మీకు తన అనుగ్రహము నుండి రెండు భాగములు ప్రసాదిస్తాడు, మీకు వెలుతురు సైతం ప్రసాదిస్తాడు. దానిద్వారా మీరు నడవగలరు, మరియు మిమ్మల్ని క్షమిస్తాడు కూడా. అల్లాహ్ క్షమించేవాడు అనుగ్రహించేవాడు."**(అల్‌హదీద్:28)

కేవలం పరలోక ప్రయోజనాలే కాకుండా, ఇహలోక లాభాలు సైతం ప్రాప్తమవుతాయి. వాటిలో కొన్ని ఇవి:

అల్లాహ్ ప్రేమ: అల్లాహ్ ప్రసన్నత కొరకు దైవభీతి మరియు పరిశుద్ధమైన జీవితాన్ని అవలంబించే వ్యక్తి అల్లాహ్‌కు ప్రియమైన వాడని దివ్య ఖుర్‌ఆన్ తెలియజేస్తుంది. **"అల్లాహ్ భయభక్తులు గల వారంటేనే ఇష్టపడతాడు".** (తౌబా:4)

అల్లాహ్ సాన్నిధ్యం: తఖ్వా యొక్క జీవితాన్ని అవలంబించటం వల్ల దైవ సాన్నిధ్యం సైతం ప్రాప్తమవుతుంది. **"అల్లాహ్‌కు భయ పడుతూ ఉండండి, భయభక్తులు గలవారితోనే అల్లాహ్ ఉంటాడు అనే విషయం తెలుసుకోండి".** (అల్ బఖర:194)

ఉపాధి లభించే మార్గం: దైవం దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు: **'ఏ వ్యక్తి అయితే అల్లాహ్‌కు భయపడతాడో, అల్లాహ్ అతనికి గట్టెక్కే మార్గాన్ని చూపుతాడు (ముక్తిమార్గము కల్పిస్తాడు) మరియు అతనికి తెలియని మార్గం ద్వారా ఉపాధి ప్రసాదిస్తాడు'.**
(అల్ తలాఖ్: 2,3)

గీటురాయిని ప్రాప్తి, పాపాల మన్నింపు: అల్లాహ్ తన భయభక్తులను అవలంబించేవారికి ఓ విచక్షణా శక్తి ప్రసాదిస్తాడు. దాని ద్వారా అడుగడుగునా వారికి స్వయంగా తెలుస్తూ ఉంటుంది. ఏ మార్గం సత్యమైనదో, ఏది అసత్యమైనదో. **"విశ్వసించిన ప్రజలారా! మీరు గనక భయభక్తులను అవలంబిస్తే, అల్లాహ్ మీకు గీటురాయిని ప్రసాదిస్తాడు, మీ నుండి మీ చెడులను దూరం చేస్తాడు. మీ తప్పులను మన్నిస్తాడు. అల్లాహ్ అత్యధికంగా అనుగ్రహించేవాడు."**
(అన్ఫాల్:29)

సదాచారాల స్వీకరణ: ఆచారాలు దైవ సమక్షంలో స్వీకరించబడటానికి తఖ్వాయే పునాది. **"భయభక్తులు గలవారి మొక్కుబడులనే (ఆచారాలనే) అల్లాహ్ స్వీకరిస్తాడు."** (అల్ మాయిదహ్:27)

గౌరవప్రాప్తి: అల్లాహ్ దృష్టిలో తఖ్వాయే అసలైన ప్రమాణం. ఆ తఖ్వా ద్వారా దాసుడు శ్రేష్ఠమైన స్థాయి పొందగలడు.భయభక్తులు గలవారికే సర్వ రకాల సాఫల్యం, ప్రతిఫలం లభిస్తుంది. పరలోక లాభాలే కాకుండా ఇహలోక సాఫల్యం సైతం ప్రాప్తమవుతుంది. సూర యూసుఫ్ అధ్యయనం చేస్తే మనం గ్రహించే నీతి ఏమంటే ప్రవక్త యూసుఫ్ (అ) అధికార పీఠం అధిష్టించాక ఆయన (అ) సోదరులం దరూ లేమిలో ఆయన వద్దకు వచ్చి విన్నవించుకున్నారు. ప్రవక్త యూసుఫ్ (అ) తమ సోదరులను సంభాషిస్తూ తన పరిచయం చేశాక తన సాఫల్యానికి కారణమయిన మౌలిక రహస్యాలను పేర్కొన్నారు. **"వాస్తవం ఏమిటంటే భయభక్తులతో, ఓర్మితో వ్యవహరించే సత్పురుషుల ప్రతిఫలం అల్లాహ్ వద్ద వృధా కాదు."** (యూసుఫ్ :90)


ముహమ్మద్ రఫీ ఖాన్

గాజా పట్టిపై ఇజ్రాయల్ నెత్తుటి క్రీడ



ప్రపంచమంతా హాయిగా నిదురపోతున్నా...భూమండలంపై ఒక ప్రాంతం మటుకు నిద్రహారాలు మాని కనీసం చనిపోయిన తమవారి అంత్య క్రియలు చేసుకోవటానికయినా ఎవరయినా మిగిలుండాలనే తపనతో యుద్ధ భయంకర జ్వాలల మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గత కొన్ని రోజులుగా బిక్కుబిక్కుమంటూ గడుపుతోంది.

గాజాలో గత కొన్ని రోజులుగా ఇజ్రాయల్ సృష్టిస్తున్న మారణహోమాన్ని ప్రపంచం తమాషాగా చూస్తోంది. ఈ దాడుల్లో అధిక శాతం స్త్రీలు, పిల్లలే విగత జీవులుగా మారుతున్నారు. ఒకవైపు ఇజ్రాయల్ వైమానిక దాడులతో గాజా పట్టణంపై బాంబుల వర్షం కురిపిస్తోంది. మరోవైపు మిసైళ్ళతో నివాసాలను నేలమట్టం చేస్తోంది. 1920లో యూరప్ నుంచి వలస వచ్చిన యూదులకు ఆశ్రయం ఇచ్చిన వారి తన, మాన, ధనాలను కొల్లగొడుతూ 1948 నుంచి 1967 వరకు సాగిన ఇజ్రాయల్ దురాక్రమణలతో పాలస్తీనా దేశం అతి చిన్న ప్రదేశంగా మిగిలిపోయింది. 40 కిలోమీటర్ల పొడుగు, 10 కిలోమీటర్ల వెడల్పు కలిగిన గాజా పట్టిలో దాదాపు 15 లక్షల మంది నివసిస్తున్నారు.



1994లో గాజా చుట్టూ ఒక గోడను ఇజ్రాయల్ నిర్మించింది. బయటి ప్రపంచంతో సంబంధాలు లేకుండా గాజాకు ఒకవైపు మధ్యధరా సముద్రం ఉంటే మరోవైపు ఈజిప్టు, ఇజ్రాయల్ వైపు గోడను నిర్మించి గాజాను ఒక జైలుగా మార్చివేసింది. ఇస్రాయల్ హింసా దౌర్జన్యాలను, దురాక్రమణలను ఐక్యరాజ్య సమితి 700 సార్లకు పైగా ఖండించింది.అయితే ఖండించిన ప్రతిసారీ ఆమెరికా వీటో చేసింది. నేటి పరిస్థితుల వెలుగులో ఆలోచిస్తే కాలమే తీర్పు ఇవ్వాలన్న సమస్యల్లో ఇదో సమస్యగా తోస్తుంది.

2012.indd 20 11/28/12 12:07 PM

ఈ నిలయం కలకాలం

శ్రీ

నిలయమయి నిలవాలి!



మన సంఖ్యామానం!

ఒకటి	= 1
పది	= 10
నూరు	= 100
వెయ్యి	= 1000
పది వేలు	= 10000
లక్ష	= 100000
పది లక్షలు	= 1000000
కోటి	= 10000000
దశ కోటి	= 100000000
శత కోటి	= 1000000000
సహస్ర కోటి (అర్బుధం)	= 10000000000
న్యార్బుధం	= 100000000000
ఖర్వం	= 1000000000000
మహా ఖర్వం	= 10000000000000
పద్మం	= 100000000000000
మహా పద్మం	= 1000000000000000
క్షోణి	= 10000000000000000
మహా క్షోణి	= 100000000000000000
శంఖము	= 1000000000000000000
మహా శంఖం	= 10000000000000000000
క్షితి	= 100000000000000000000
మహా క్షితి	= 1000000000000000000000
క్షోభం	= 10000000000000000000000
మహా క్షోభం	= 100000000000000000000000
నిధి	= 1000000000000000000000000
మహా నిధి	= 10000000000000000000000000
పరాతం	= 100000000000000000000000000
పరార్ధం	= 1000000000000000000000000000
అనంతం	= 10000000000000000000000000000
సాగరం	= 100000000000000000000000000000
అవ్యయం	= 1000000000000000000000000000000
అమృతం	= 10000000000000000000000000000000
అచింత్యం	= 100000000000000000000000000000000
అమేయం	= 1000000000000000000000000000000000
భూరి	= 10000000000000000000000000000000000
మహా భూరి	= 100000000000000000000000000000000000

ఇస్లాం





Islam
the way of
LIFE

అత్యంత హేతుబద్ధమయిన ధర్మం

"ఇస్లాం సన్యాసత్వాన్ని తొలగించి మానవీయతను స్థాపించింది. బానిసలలో ఆశను చిగురింపజేసింది. మానవాళికి సహోదరత్వాన్ని నేర్పింది. మానవ సహజ ప్రవృత్తికి సంబంధించిన మౌలిక యదార్థాలకు గుర్తింపు ఇచ్చింది". (కానన్ టేలర్)

"క్రైస్తవాన్ని కాన్ స్టాంటిన్, బౌద్ధాన్ని అశోకుడు, జోరాష్ట్రియాన్ని సైరస్ - ప్రతి రాజూ తాను నమ్మిన మతానికి మద్దతునివ్వడం మూలానే అవి విజయాలు సాధింగలిగాయి. కానీ, ఇస్లాం విషయంలో ఇలా జరగ లేదు.... ఇస్లాం విజయాలు అద్భుతమయినవి. నామ మాత్రపు మానవ సహకారంతో విజయ దుందుభి మ్రోగిస్తూ అటు ప్రాన్సును స్పెయిన్‌తో వేరు చేసే పర్వత శ్రేణి పైరవీనీస్ మొదలు హిమాలయాల వరకూ, మధ్య ఆసియా ఎడారుల మొదలు మధ్య ఆఫ్రికా ఎడారుల వరకూ అది విస్తరించడాన్ని కొన్ని తరాలు కళ్ళారా చూడగలిగాము ". (ఎ.ఎం.ఎల్. స్టాండర్డ్)

"నా అనుభవంలో సమానత్వాన్ని ప్రశంసాభరితమయిన లీతిలో సాధించిన మతమంటూ ఏదన్నా ఉంటే అది కేవలం ఇస్లాం మాత్రమే".

(స్వామీ వివేకానంద)

"హేతువు అన్న పదానికి శాబ్దిక అర్థం లీత్యాను చారిత్రక అర్థం లీత్యాను ఇస్లాం అత్యంత హేతుబద్ధమయిన ధర్మం. అనేక మతాలు, ఆధ్యాత్మిక వ్యవస్థల్లో గల మూఢ విశ్వాసాలు - సాధువుల పూజ దగ్గర నుంచి జపమాలలు, మంత్రదండాల వాడకం వరకు - ఇస్లాం ధర్మ విశ్వాసాలలో మచ్చుకయినా కనబడవు. దేవుని ఏకత్వాన్ని అది ప్రకటించినంతగా మరే మతధర్మమూ ప్రకటించ లేదు. ఇస్లాంకు మనస్సులను గెలుచుకునే శక్తి ఉంది."

(ఎడ్వర్డ్ మాంటెట్)

"విభిన్న జాతుల మధ్య అద్భుతమయిన అవగాహన, పరస్పర సహకార సాంప్రదాయం ఇస్లాంలో ఎంతో ఘనంగా ఉంది. విపరీత వైవిధ్యాలు గల విభిన్న జాతులకు సమాన స్థానం, సమానావకాశాలు, శ్రమలో కష్టించి పరిశ్రమించే సమానత్వాన్ని శోధించి ఏకం చేయడంలో ఇస్లాం గడించిన గట్టి విజయాల ఘన చరిత్ర ప్రపంచంలో ఏ ఇతర సమాజానికీ లేదు... సమాధాన పడే అవకాశాల్లేని జాతులను, తెగలను సమాధాన పర్చే శక్తి నేటికీ ఇస్లాంకే ఉంది. ఎప్పటికయినా ప్రాచ్య, పాశ్చాత్య సమాజాల మధ్యనున్న వైరం స్థానే స్నేహం ఏర్పడాలంటే ఇస్లాం మధ్యవర్తిత్వం తప్ప మార్గాంతరం లేదు. ఈ రెండు సమాజాలు కలిసిపోతే ప్రపంచ శాంతి అవకాశాలు ఊహించలేనంతగా మెరుగవుతాయి. ప్రాచ్య సంబంధాల విషయమయి యూరప్ ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ పరిష్కారం ఇస్లాం చేతిలోనే ఉంది".

(హెచ్.ఎ.ఆర్.గిబ్)